# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 24 మార్చి 2023


## రూ.1.3 కోట్ల విలువైన మొబైల్ ఫోన్లు రికవరీ



**కడప క్రైం, మార్చి 23, ప్రభాతవార్త:**

జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం ద్వారా ప్రారంభించిన అనతి కాలంలోనే రూ.1.3 కోట్ల విలువైన 476 మొబైల్ ఫోన్లు రికవరీ చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సైబర్ క్రైం టెక్నికల్ విభాగాన్ని అభినందించారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండా, ఎఫ్ఐఆర్ నమోదు లేకుండా ఫోన్లు పోగొట్టుకున్న వారికి తిరిగి అందజేయాలనే సంకల్పంతో గత ఏడాది డిసెంబరు 1న ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజ లకు మరింత సులువైన సేవలు అందించడానికి చాట్ బాక్స్ ద్వారా 9392941541 సేవలు ప్రారం భించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 3600 మొబైల్ మిస్సింగ్ ఫిర్యాదులు రాగా ఎంఎంటీఎస్ ద్వారా 700 యాక్టివ్ మొబైల్స్ గుర్తింపు జరిగిందని ప్రస్తుతం దాదాపు రూ.60లక్షల విలువైన 215 మొబైల్స్‌ను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. మీడియా సమావేశంలో ఏఎస్పీ తుషార్ డూడి, ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబులు పాల్గొన్నారు.

## అలంకార ప్రాయంగా మంచినీటి ట్యాంక్



**గాలివీడు మార్చి 23ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని స్థానిక హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంక్ అలంకారప్రాయంగా మారింది. ప్రభుత్వం త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం లక్షల రూపాయలు వెచ్చించి నీటి పథకాలను అందుబాటులోకి తెస్తుంటే వాటిని వినియోగంలోకి తేవడంలో మాత్రం అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోంది. గాలివీడు పట్టణ పరిధిలో శెట్టివారిపల్లెకు సంబంధించిన మంచినీటి ట్యాంక్ నూతనంగా నిర్మించినప్పటికీ వినియోగంలోకి మాత్రం తీసుకురావడం లేదని చుట్టుపక్కల ప్రజలు ఆరోపిస్తున్నారు. గుత్తేదారుల బిల్లుల చెల్లింపులో జాప్యమా, వాటర్ గ్రిడ్‌లో లోపమా లేక అధికారుల అలసత్వమా తెలియదుగానీ వెరసి మంచినీటి ట్యాంక్ మాత్రం దిష్టి బొమ్మలా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు వేసి వచ్చేస్తోంది నీటి ఎద్దడి ముంచుకోస్తోంది. ఇలాంటి తరుణంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సక్రమంగా వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బాల్య వివాహ ప్రయత్నానికి దిశ చెక్

**- అవగాహన సదస్సుల ఫలితమే.. విద్యార్థినికి దిశ వైపునకు పయనం**

**- తల్లిదండ్రుల చేత ఒప్పంద ప్రమాణ పత్రం**

**కడప క్రైం, మార్చి 23, ప్రభాతవార్త:**

కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ హైస్కూలులో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినికి పరీక్షలవగానే వివాహం చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో గురువారం సదరు విద్యార్థినీని తాను చదువుతున్న పాఠశాల వద్ద వదిలి తాము వైవీ స్ట్రీట్‌లో పెళ్లి బట్టల షాపింగ్ కోసం వెళ్లారు. విద్యార్థినీని తాను చదువుకోవాలనుకుంటే తమ తల్లిదండ్రులు వివాహ ప్రయత్నాలు చేస్తున్నారని తమ క్లాస్‌మేట్స్‌కు పాఠశాల టీచర్లకు తెలిపింది. ఈ క్రమంలోనే ఇటీవల తమ పాఠశాలలో దిశ పోలీసు స్టేషన్ అధికారులు, సిబ్బంది వచ్చి బాల్య వివాహాల నియంత్రణతో పాటు మహిళలు, చిన్నపిల్లల పట్ల జరిగే నేరాల నియంత్రణపై అవగాహన సదస్సులను నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసుకుంది. వెంటనే కడప దిశ పోలీసు స్టేషన్ వద్దకు స్వచ్ఛందంగా నేరుగా వెళ్లింది. అక్కడి డీఎస్పీ వాసుదేవన్, సీఐ, ఎస్సైలకు ఫిర్యాదు చేసింది. దీంతో వెంటనే స్పందించిన డీఎస్పీ విద్యార్థినీ తల్లిదండ్రులను పిలిపించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టకష్టాలను తెలిపి వారికి కౌన్సెలింగ్ చేశారు. వారు బాల్య వివాహ ప్రయత్నాన్నివిరమించడంతో పాటు పోలీసులకు ఒప్పంద ప్రమాణ పత్రంను స్టేట్‌మెంట్ రూపంలో లిఖితపూర్వకంగా ఇచ్చారు. ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న వ్యక్తి ఆయన భార్యకు ముగ్గురు ఆడపిల్లలు. ఒక కుమారుడు ఉన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ దిశ ద్వారా విద్యా సంస్థల్లో బాల్య వివాహాల నియంత్రణ, మహిళలు, చిన్నపిల్లల పట్ల జరుగుతున్న జరగనున్న నేరాల గురించి క్షుణ్ణంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సంఘటనపై జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ విషయాలను అడిగి తెలుసుకొని దిశ టీం తీసుకున్న చర్యను ప్రత్యేకంగా అభినందించారు.

## ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



**బద్వేలు అర్బన్, మార్చి 23 ప్రభాతవార్త :**

రంజాన్ మాసం శుభాల వసంతం అని ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డా॥ సుధ, మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, అడా ఛైర్మెన్ సింగసాని గురుమోహన్ అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ముస్లీంలకు అత్యంత పవిత్రమైన మాసం రంజాన్ మాసం అన్నారు. రంజాన్ మహత్తర మాసం అని, ఈ మాసంలో ముస్లీం సోదరులు ఉపవాసాలు ఉంటూ దాన, ధర్మాలకు ప్రతీకగా నిలుస్తారన్నారు. నెల రోజుల పాటు భక్తి శ్రద్ధలతో కఠోర ఉపవాసాలు చేయడం మహా పుణ్య కార్యం అన్నారు. ఈ మాసం వాతావరణం అంతా పుణ్యకారం దైవ భీతి అనే సుగుణాలతో నిండాలని, ఈ పవిత్ర రంజాన్ మాసం మానవాళికి శాంతి సందేశం అందించాలని, అందరి ఇంట సుఖ శాంతులు నిండాలని వారు ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

## మట్టి నమూనా పరికరాలు త్వరితగతిన రిపేర్ చేయించండి

**భూసార పరీక్ష కేంద్రం ఆకస్మిక తనిఖీలు**

**ఏ.ఓ. నాగేశ్వర రావు**



**కడప, మార్చి 23, ప్రభాతవార్త :**

భూసార పరీక్ష కేంద్రాల్లో గల మట్టినమున పరికరాలను త్వరితగతిన రిపేర్ చేయించాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు తెలిపారు గురువారం ఊటుకూరు భూసార పరీక్ష కేంద్రం, సంచార భూసార పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా మట్టి నమూనా కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాల్లో గల మట్టి నమూనా పరికరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. వీటిని పునరుద్ధరించేందుకు ఎంత నిధులు ఖర్చు అవుతున్నాయో అంచనా వేయాలని భూసార పరీక్షా కేంద్రం ఏ డి ఏ లక్ష్మీదేవి గారికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు భూసార పరీక్ష కేంద్రం త్వరలో పునరుద్ధరణ జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈనెల 25వ తేదీలోగా పరికరాల పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం ఏవోలు మంజులరాణి, సుదేష్ణ, ఎంఎస్‌టి ఎల్ ఏవో ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి యువకుడు మృతి



లక్కే గణేష్ మృతదేహం

**పులివెందుల, మార్చి 23, ప్రభాతవార్త :**

పట్టణంలోని ఎర్రగుడిపల్లెకు చెందిన లక్కే గణేష్(19) అనే యువకుడు బావిలో పడి మృతిచెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... లక్కే సుబ్బ రాయుడు, సుబ్బమ్మల రెండో కుమారుడు గణేష్ స్నేహితులతో కలిసి సరదాగా బ్రాహ్మణపల్లె సమీపంలోని బావి వద్దకు ఈతకు వెళ్లాడు. ప్రమాద వశాత్తు బావిలో పడగా స్నేహితుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం కోసం గాలించారు. మృతదేహాన్ని బావి నుండి బయటకు తీసుకువచ్చి ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అనంతరం పోస్టు మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

## రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

**ప్రక్కనే ప్రభుత్వ పాఠశాల**

**డ్రైనేజీ నీటిలోనే పాఠశాలకు వెళ్ళాల్సిన పరిస్థితి**

**అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం**

**బద్వేలు, మార్చి 23 ప్రభాతవార్త :**

పట్టణంలోని రూపరాంపేట శివాలయానికి వెళ్ళే రహదారిలో రాధాకృష్ణ కళ్యాణ మండపం సమీపంలో ప్రభుత్వ పాఠశాల ప్రక్కన మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. డ్రైనేజీ కాలువలన్నీ బూడిపోవడంతో మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తూ దోమలకు, పందులకు నిలయంగా మారింది. పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉండడంతో ఈ రహదారి గుండానే డ్రైనేజీ నీటిలో నుండే విద్యార్థులు పాఠశాలకు వెళ్ళాల్సి న దుస్థితి ఏర్పడింది. బద్వేలులో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్థంగా ఉందనడానికి నిదర్శనమే ఈ రహదారి. పట్టణంలో అనేక ప్రాంతాల్లో ఇలాంటివి దర్శనమిస్తూనే ఉంటాయి. ఈ మధ్య కాలంలో సీసీ రోడ్లు వేశాక డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. మొదటగా డ్రైనేజీ ఏర్పాటుచేసిన తరువాత సీసీ రోడ్డు వేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా కాంట్రాక్టర్ లబ్ధి కోసం కాంట్రాక్టర్‌కు త్వరగా బిల్లు రావాలనే ఉద్దేశ్యంతో పని త్వరగా అవుతుందనే కారణంతో సీసీ రోడ్డు వేశారే తప్ప డ్రైనేజీ కాలువను మరిచారు. దీని వల్ల అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్థంగా మారడంతో పాటు రోడ్లపై మురికి నీరు ప్రవహిస్తూ వాటి వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఏర్పడుతుంది. ఇందుకు నిదర్శనం రాధాకృష్ణ కళ్యాణ మండపం సమీపంలో అనుకుంటే పొరపాటే. అనేక ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొందని వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడమేగాక మున్సిపల్ సమావేశంలో విన్నవిస్తూనే ఉన్నారు. ఇదిలా ఉంటే కొందరి స్వార్థం కోసం రూపరాంపేట శివాలయానికి వెళ్ళే రహదారి



రోడ్డు పై ప్రవహిస్తున్న మురికి నీరు.

పనులను జరగకుండా అడ్డుకుంటున్నారని సమాచారం. ఎన్నో సంవత్సరాలుగా రూపరాంపేట శివాలయానికి రహదారి ఏర్పాటు చేయాలని ప్రస్తుతం ఉన్న రహదారి దయనీయంగా ఉండడం వలన సీసీ రోడ్డును ఏర్పాటు చేయాలనుకున్నారు. మొదటగా తారు రోడ్డు మంజూరైనప్పటికీ దీని వల్ల రోడ్డు దెబ్బతింటుందని సీసీ రోడ్డు వేయాలని నిర్ణయించిన తదుపరి వెంటనే సీసీ రోడ్డు కూడా మంజూరైనట్లు తెలుస్తుంది. కానీ సీసీ రోడ్డు పనులు జరగకుండా ఆదిలోనే పనులు జరగకుండా చేసే ప్రయత్నం చేశారు. చాలా రోజులుగా పనులు ఇలాగే ఆగిపోతున్నాయని, ఇప్పటికైనా సీసీ రోడ్డు ఏర్పాటుచేస్తే డ్రైనేజీ వ్యవస్థ కూడా పటిష్టపడుతుందని అక్కడి ప్రజలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఎన్.డి.ఆర్.ఎఫ సహాయక చర్యల స్పూర్తితో.. ముందుకెళ్లాలి

**మామిళ్లపల్లె ఎన్.సి.సి. ప్రాంగణంలో కెపాసిటి బిల్డింగ్ ప్రోగ్రామ్ ద్వారా సామాజిక కార్యక్రమం**

**తహసీల్దార్ గంగయ్య,**

**కడప, మార్చి 23, ప్రభాతవార్త :**

విపత్కర పరిస్థితుల్లో ఎన్.డి.ఆర్.ఎఫ్. టీమ్ సహాయక చర్యల స్పూర్తితో సమాజంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కాపాడే సామాజిక బాధ్యత అందరిపై ఉందని సి.కె.దిన్నె తహసీల్దార్ గంగయ్య పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశాల మేరకు.. ఎస్.డి.ఆర్.ఎఫ్. 10వ బెటాలియన్ అసిస్టెండ్ కమాండెంట్ శివకుమార్ ఆధ్వర్యంలో సి.కె.దిన్నె మండల పరిధిలోని మామిళ్ళపల్లె ఎన్.సి.సి. శిక్షణ ప్రాంగణంలో.. ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే ప్రాణాలను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ ద్వారా సామాజిక అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల తహశీల్దార్ గంగయ్య, స్థానిక కార్పొరేటర్ చంద్రహాస రెడ్డి, ఫైర్ శాఖ ఎస్.ఐ. జలీల్, ఎన్.సి.సి. సూపరింటెండెంట్ సుబేదా హనుమాన్ సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా.. ప్రజలను ప్రాణాపాయం నుండి కాపాడేందుకు సాహసోపేతమైన సహాయక చర్యలతో ఎస్.డి.ఆర్.ఎఫ్. టీమ్ సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. వరదలు, అగ్నిప్రమాదలు, భూకంపాలు తదితర సహజ విపత్తులతో పాటు ఇతర ప్రమాద సమయాల్లో ఎన్.డి.ఆర్.ఎఫ్. సిబ్బందితో పాటు ఎస్.డి.ఆర్.ఎఫ్., జిల్లా విపత్తుల నిర్వహణ, ఫైర్ సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా వుందన్నారు. అయితే.. ప్రమాద సమయాల్లో సహాయక సిబ్బంది వచ్చేలోపు ప్రజల ప్రాణాలను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ స్వీయ భద్రతా చర్యలు, తక్షణ సహాయక చర్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. దైనందిన జీవితంలో వాణిజ్య ప్రాంతాలు, పరిశ్రమలు, పలు రసాయనాలు, ఉత్పాదక కేంద్రాల్లో, రహదారులపై.. ఊహించని ప్రమాదాలు ఎదురైనప్పుడు ప్రాణాపాయం నుండి బయట



పడేందుకు తక్షణమే అందించాల్సిన సహాయక చర్యలపై.. అవగాహన పెంచే కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ సికే దిన్నె మండలంలో నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఎన్. డి.ఆర్.ఎఫ్. 10 బెటాలియన్ టీమ్ నిర్వహించిన అవగాహన అంశాలు ఎంతో విలువైనవి అని, దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ ఈ అంశాలను గుర్తుంచుకుని మన సమీపంలో ప్రజలను ప్రమాద సమయాల్లో ప్రాణాపాయం నుండి కాపాడాలని సూచించారు. అనంతరం ఎన్. డి.ఆర్.ఎఫ్. అసిస్టెంట్ కమాండెంట్ శివకుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలను, మాక్ ఎక్స్ పర్ మెంట్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యం తోనే.. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు.. ఇప్పటికే హెచ్.పి.సి.ఎల్., ఐఒసిఎల్ ప్రాంగణాల్లో ఆఫ్ సైట్ ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ప్రయోగాలు భవిష్యత్తులో ఎపుడైనా అనుకోని పరిస్థితుల్లో ఇలాంటి ప్రమాదాలు జరిగితే.. ఎదుర్కొనే ధైర్యాన్ని, స్పూర్తిని నింపి ప్రతి ఒక్కరిలో సామాజిక బాధ్యతను గుర్తు చేస్తాయన్నారు. ఇలాంటి ప్రయోగాల ద్వారా సమాజంలో అవగాహన పెంచడంతో పాటు భారీ మొత్తంలో ప్రాణనష్టం, ఆస్తి నష్టాలను అరికట్టవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో.. ఎన్.డి.ఆర్.ఎఫ్. ట్రైనింగ్ టీమ్ లీడర్ మహమ్మద్ అలీ, ఎన్.సి.సి. క్యాడేట్లు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పవిత్ర రంజాన్ మాసం.. నేటి నుంచి ప్రారంభం

**వేంపల్లె, మార్చి 23, ప్రభాతవార్త :**

ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం శుక్రవారంతో ప్రారంభం కానుంది. ఉపవాసాలు ప్రారంభించాలని మతపెద్దలు తెలిపారు. రంజాన్ మాసానికి ఇస్లాంలో అత్యంత ప్రాధాన్యత ఉంది. ముస్లిం దివ్య గ్రంథమైన పవిత్ర ఖురాన్ ఈ మాసంలోనే దివి నుండి భువిపైకి అవతరించినట్లు పెద్దలు చెబుతున్నారు.

**- దానంతో దాతృత్వం :** రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం ఫిత్రా పేరుతో పేదలకు తన వద్ద అవసరానికి మించి ఉన్న ధనంతో రెండున్నర శాతం విధిగా దానం చేయాలి. అలా చేసినప్పుడే వారు సంపాదించిన ధనం పరిశుద్ధమవుతుంది. అలాగే సమాజంలో పేదరిక నిర్మూలన జరుగుతుందని ఆకాత్ ఆశయం. దీంతోపాటు ఫిత్రా రూపంలో కూడా పేదలకు దాన, ధర్మాలు చేయాల్సి ఉంటుంది. ఇలా చేయడం వలన ప్రతి ముస్లింలో దాతృత్వం పెరుగుతుంది.

**- తరావీ.. మానసిక పరివర్తన :** ముస్లింలో చేసే ప్రార్థన మానసిక పరివర్తన తెస్తుంది. నిర్మల మనసుతో పాటు ప్రశాంతత నేర్పుతుంది. అలాంటి నమాజ్ ఈ మాసంలో రోజూ ఐదు పూటలా చేస్తారు. ఇందులో భాగంగా రాత్రి ఇషాన మాజ్ తర్వాత 30రోజుల పాటు ప్రత్యేక తరావీ నమాజ్‌ను చేస్తారు. దివ్యఖురాన్‌లోని 30 భాగాలను ఈనెలలోనే 30రోజుల్లో పూర్తిచేస్తారు. దీంతో దైవంపై భక్తి పెరగడంతోపాటు



ప్రార్థనలకు సిద్ధమైన మసీదు

ఇతర చెడు అలవాట్లకు దూరం అవుతారు.

**- ఇఫ్తార్ సోదర సౌభ్రాతృత్వం :** రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు విరమించే సమయంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులో సోదర భావంతో సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తారు. ఈ సమయంలో చిన్న, పెద్ద, పేద, ధనిక లాంటి తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి పాల్గొంటారు. ముఖ్యంగా ఐక్యత, సోదరభారం పెరుగుతుంది.

**- హలీం రుచులు ప్రత్యేకం :** రంజాన్ మాసం నెల రోజులు లభించే ప్రత్యేక వంటకం హలీం. ముస్లిం సోదరులకు రంజాన్ మాసంలో ప్రియ వంటకంగా మారింది. ఇది పట్టణంలో చాలా చోట్ల షెడ్లు వేసి దుకాణాలలో పెట్టి అమ్ముతారు.

## విద్యార్థి దశలోనే ఉత్తమమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

వార్త IVవ పేజీలో

## ఆయా గ్రామాల్లో రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**గ్రౌండ్ ట్రూతింగ్ పక్రియను వేగవంతం చేయండి**

**హద్దు రాలు నాటే పక్రియను త్వరగా పూర్తి చేయాలి**

**వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్**

**రాయచోటి, మార్చి 23 ప్రభాతవార్త :**

ఆయా గ్రామాల్లో రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. లిగురువారం విజయవాడ సిసిఎల్ఏ కార్యాలయం నుండి రీసర్వే పురోగతి పై కలెక్టర్లు, జేసిలతో సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఆర్ఓ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి జయారాజ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ మాట్లాడుతూ....నాణ్యతా ప్రమాణాల తనిఖీ, గ్రౌండ్ ట్రూతింగ్, ఫైనల్ ఆర్ ఓఆర్, డ్రోన్ ఫ్లయింగ్ తదితర ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. నిర్దేశించిన గడువులోగా గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను పూర్తి స్థాయిలో చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. హద్దురాలు నాటే ప్రక్రియను త్వరగా పూర్తి



చేయాలన్నారు. డ్రోన్ ఏరియల్ ఫ్లయింగ్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. బౌండరీ కన్ఫర్మేషన్, ఏరియా వ్యాలిడేషన్, సర్వే కంప్లిషన్, ఫైనల్ రెవిన్యూ రికార్డు నిర్దేశించిన గడువులోగా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్, ఫైనల్ ఆర్ ఓఆర్, 13 నోటిఫికేషన్ తదితర ప్రక్రియలన్నీ కూడా పురోగతి కనిపించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రీసర్వే పనులన్నీ సకాలంలో పూర్తిచేయలని సూచించారు. హద్దురాల నాటి ప్రక్రియ, గ్రౌండ్ ట్రూతింగ్, డ్రోన్ ఫ్లయింగ్ ప్రక్రియలను వేగవంతం చేయాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడిని కలెక్టర్ ఆదేశించారు.

## సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డిజి) సాధనకు అత్యంత ప్రాధాన్యం

**అనీమియా నివారణ చర్యలు ముమ్మరంగా చేపట్టాలి - మనబడి -నాడు నేడు పనులను త్వరగా పూర్తి చేయాలి**

**సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలి**

**వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన చీఫ్ సెక్రటరీ డా॥ జవహర్ రెడ్డి**



**రాయచోటి, మార్చి 23 ప్రభాతవార్త :**

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డిజి) సాధనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చీఫ్ సెక్రటరీ డా.జవహర్ రెడ్డి తెలిపారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్కూల్ ఎడ్యుకేషన్, మహిళా, శిశు సంక్షేమ ప్రభుత్వ పథకాలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, విలేజ్, వార్డు సెక్రటేరియట్, స్పందన (గ్రీవెన్స్, గడప గడపకు మన ప్రభుత్వం, వివిధ ప్రభుత్వ పథకాల అమలు పై కలెక్టర్లు, జేసిలతో చీఫ్ సెక్రటరీ డా.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ మినీ విసి హాల్ నుండి కలెక్టర్ గిరీషా పిఎస్, జేసి తమీమ్ అన్సారియా, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ డా.జవహర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధనలో ముఖ్యమైన 8 అభివృద్ధి సూచికల్లో నిర్దేశించిన లక్ష్యాలు సాధించుటకు అధికారులు కృషి చేయాలని సూచించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధనలో భాగంగా అనీమియా నివారణా చర్యలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఇందుకోసం గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికల్లో అనీమియా బాధితులను గుర్తించి వారిలో హిమోగ్లోబిన్ శాతం పెంచే విధంగా ఫోలిక్ యాసిడ్ మాత్రలు, ఐరన్ సిరప్ వంటి వాటిని అందించి, ప్రతి నెల వారిలో హెచ్ బి శాతం మెరుగుదల అయ్యేలా చూడాలన్నారు. తక్కువ బరువు ఉన్న పిల్లలపై ఐసిడిఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మన బడి నాడు నేడు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జగనన్న గోరుముద్దను పటిష్టంగా అమలు పరచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరగాలన్నారు. ఫినిషింగ్ దశలో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తిచేసి, వివిధ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను స్టేజ్ కన్వర్షన్ జరిగేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలనే లక్ష్యం మేరకు అధికారులు నిబద్ధత, బాధ్యతతో పని చేయాలని ఆదేశించారు. ఇంకా వివిధ ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై చీఫ్ సెక్రటరీ జిల్లాల కలెక్టర్ లు, జెసిలు, జిల్లా అధికారులకు దిశ నిర్దేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.

## వైసిపికి జలక్కిచ్చిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు

**- ఆత్మప్రబోధానుసారం ఓట్లు వేసిన ఎమ్మెల్యేలు**

**- మంచుమర్తి అనురాధ గెలుపుతో టిడిపి క్యాడర్లో మరింత నూతన ఉత్తేజం**

**సంబేపల్లి, మార్చి 23ప్రభాతవార్త:**

ఎమ్మెల్యేలు ఎన్నుకొనే ఎమ్మెల్సీ ఎన్నికలలో మరో మారు ప్రజాస్వామ్యాన్ని రక్షించడంతోతోనే ఎమ్మెల్సీగా పంచుమర్తి అనురాధ గెలుపొందారని మాజీ జడ్పీటిసి మల్లు నర్సారెడ్డి, క్లస్టర్ టిడిపి ప్లాస్టర్ ఇన్‌ఛార్జ్ మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, టిడిపి మండలాధ్యక్షులు చిన్నరెడ్డి యాదవ్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు గురువారం మాట్లాడుతూ ఎమ్మెల్సీగా పంచుమర్తి అనురాద గెలుపొందడం తెలుగుదేశం పార్టీ శ్రేణులలో మరింత జోష్ నెలకొందని వారు తెలియజేశారు. గత ఎన్నికలలో 23 ఎమ్మెల్యే స్థానాలను తెలుగుదేశం పార్టీ గెలువడం జరిగిందని, నలుగురు ఎమ్మెల్యేలు వైసిపితో కలిసి పనిచేస్తున్నప్పటికీ ఇదిలా ఉంటే వైసిపిపై ఆ పార్టీ ఎమ్మెల్యేలే తీవ్ర అసంతృప్తితో రగిలి పోతున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వారికున్న ఎమ్మెల్యేల సంఖ్యను బట్టి 6 స్థానాల్లో పోటీ చేయకుండా 7 స్థానాల్లో పోటీ చేయించి ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా వ్యవహరించారని ఆరోపించారు. చివరకు చంద్రబాబు



కృషి ఫలించి న్యాయం ధర్మాన్ని గెలిపిస్తూ శాసన సభ్యులు తీర్పునిచ్చారని తెలియజేశారు. కొద్దిరోజుల క్రితమే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో క్లీన్ స్వీప్ చేసిన తెలుగుదేశం పార్టీకి ఈ ఎమ్మెల్సీ ఎన్నికలలో విజయం తెలుగుదేశం శ్రేణులలో చంద్రబాబుపై మరింత క్రేజ్ పెరిగేలా చేశాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి, నాగార్జునరెడ్డి, శివారెడ్డి, బాబురెడ్డి, రెడ్డెయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శుభాల వసంతం రంజాన్

**- రంజాన్ మాసపు ప్రారంభపు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి**

**రాయచోటి టౌన్, మార్చి 23ప్రభాతవార్త:**



రంజాన్ మాసం శుభాల వసంతమని వైఎస్సార్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రంజాన్ ఒక మహత్తర మాసమని, ఈ పేరు వినగానే మనస్సు భక్తితో, ఆనందంతో పులకరిస్తుందన్నారు. ఈ మాసంలోనే పవిత్ర ఖురాన్ గ్రంథం అవతరించిందని, రాజా (ఉపవాస వ్రతం) ఆరాధనను దైవం ఈ మాసంలోనే నిర్ణయించినందున ఈ మాసానికి పవిత్రత, గొప్పదనం వచ్చాయన్నారు. నెల రోజుల పాటు భక్తి శ్రద్ధలతో కఠోర ఉపవాసాలు చేయడం మహాపుణ్య కార్యమన్నారు. ఈ మాసం వాతావరణమంతా పుణ్యకారం, దైవభీతి అనే సుగుణాలతో నిండాలని, ఈ పవిత్ర రంజాన్ మాసం మానవాళికి శాంతి సందేశం అందించాలని, అందరి ఇంట సుఖ శాంతులు నిండాలని, రంజాన్ శోభతో నూతన అన్నమయ్య జిల్లా విరాజిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఉపవాస దీక్షలుకు, ప్రత్యేక ప్రార్థనలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా విద్యుత్, మున్సిపాలిటీశాఖలు ప్రత్యేక చొరవ చూపాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి ముస్లిం సోదరులకు రంజాన్ మాసపు ప్రారంభపు శుభాకాంక్షలు తెలిపారు.

## వేసవిలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

**కురబలకోట, మార్చి 23 ప్రభాతవార్త :**



వేసవిలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల అధికారులను ఎంపిపి దస్తగిరిసాబ్ కోరారు. గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో వేసవిలో ఉత్పన్నమయ్యే సమస్యలను అధికమించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవిలో మండలంలో తాగునీటి సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. ఎండ తీవ్రంగా ఉన్న దృష్ట్యా కూడలి ప్రాంతాలు, బ్యాంకులు, కార్యాలయాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని గ్రామ సచివాలయ సెక్రటరీలకు సూచించారు. ఇటుకబట్టి యజమానుల వద్ద పనిచేస్తున్న కూలీలకు తగిన వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి భూదేవి, తహశీల్దార్ భీమేశ్వర్ రావు, మదనపల్లె డిఎల్‌డిఓ లక్ష్మీపతి, ఎంపిడిఓ దిలీప్ కుమార్, మండల అధికారులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అమ్మవారికి డీలు బోణాలు

**రామసముద్రం, మార్చి 23 ప్రభాతవార్త:**



ఉగాది పండగను పురస్కరించుకొని గురువారం మండలంలోని పలు ప్రాంతాల్లో అమ్మవారికి మహిళలు డీలు బోణాలు పట్టి మహిళలు మొక్కులు తీర్చుకొన్నారు. పెద్దకురపల్లె పంచాయితీ మట్లవారిపల్లె గ్రామస్థులు గురువారం ఉదయం సందూరుచెరువు కట్టపై వెలసియున్న గంగమ్మకు మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఎంపిటిసి రెడ్డప్ప, ఉపసర్పంచ్ దొరల ఆధ్వర్యంలో మహిళలు దీపాలు మోసి మొక్కులు తీర్చుకొన్నారు. రామసముద్రం దుర్గమ్మ మట్టలో ఉన్న దుర్గమ్మకు ఆలయంలో శ్రీనివాస్, బొమ్మలు సమర్పించారు. దీపాలు మోసి అమ్మవారిని దర్శించుకొన్నారు.

## నిజమైన దేశభక్తుడు భగత్‌సింగ్

**వేంపల్లె, మార్చి 23, ప్రభాతవార్త :**



దేహంకంటే దేశం మిన్న అని నమ్మి దేశమాత కోసం ప్రాణా లర్పించిన అసలైన దేశభక్తులు సర్దార్ భగత్‌సింగ్, షహీద్ రాజ్ గురు, షహీద్ సుఖ్‌దేవ్‌లు అని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసి రెడ్డి అన్నారు. గురువారం వారి వర్ధంతి వేడుకలను వేంపల్లెలో కాంగ్రెస్ నాయ కులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ అంటూ విదేశీయుల దాస్య శృంఖలాల నుండి భారతమాత విముక్తి కోసం 1931 మార్చి 23న లాహోర్ సెంట్రల్ జైలులో ఉరికంభం ఎక్కి వారు అమరులయ్యారన్నారు. వారి జీవిత చరిత్ర త్యాగ నిరతి, దేశభక్తి నేటి యువతరానికి స్ఫూర్తి నివ్వాలని తులసిరెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉత్తన్న, అమర్‌నాథరెడ్డి, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

**– శ్రీనాథ్‌రెడ్డికి శ్రద్ధాంజలి :**

అనారోగ్యంతో బుధవారం హైదరాబాదులో మరణించిన సీనియర్ పాత్రికేయులు, ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డికి ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు సంతాప సానుభూతి వ్యక్తం చేశారు.

## రామ్‌కుమార్‌శ్మకు ఉగాది పురస్కారం

**పులివెందుల రూరల్, మార్చి 23, ప్రభాతవార్త :**



ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కలెక్టరు కార్యాలయంలో జరిగిన ఉగాది ఉత్సవాలలో కలెక్టరు విజయ రామరాజు చేతుల మీదుగా పులివెం దుల పురోహితుడు రామ్‌కుమార్‌శర్మ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల కడపకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెస్ డాక్టర్ రాజేష్‌బట్టర్‌చే పంచాంగ శ్రవణం వినిపించారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషించిన రామ్‌కుమార్‌శ్మకు ఉత్తమ పౌరోహిత అవార్డు కింద రూ.10వేల గౌరవ పారితోషికంతో పాటు ప్రశంసలు అందించారు. కార్యక్రమాల్లో జిల్లా ఉన్నతాధికారులు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనరు శంకర్‌బాలాజి, సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలి

**కడప వైద్యవిభాగం, మార్చి 23, ప్రభాతవార్త:**

ఎన్నికల సందర్భంగా రాహుల్ గాంధీ చేసిన ప్రసంగాలపై కక్షపూరితంగా వ్యవహరించి పరువు నష్టం దావాలు వేయడం సరైన చర్య కాదని కాంగ్రెస్ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు అన్నారు. సూరత్ కోర్టు రాహుల్ గాంధీకి రెండు సంవత్సరాలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు ఇవ్వడంతో బీజేపీ చర్యలు సరైనవి కావన్నారు. రాజకీయంగా రాహుల్ గాంధీకి వస్తున్న పేరును చూసి ఓర్వలేకనే ఇలాంటి చర్యలకు బీజేపీ తెగబడుతోందన్నారు. భారత్ జూడో యాత్రతో రాహుల్ గాంధీకి కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు ప్రజాధరణ విపరీతంగా పెరిగిందన్నారు. 2024 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తప్పుడు కేసులతో రాహుల్ గాంధీని అపఖ్యాతి పాలు చేయాలనుకోవడం బీజేపీ దిగజారుడు తనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులకు కాంగ్రెస్ పార్టీ భయపడదన్నారు. 2024 ఎన్నికల్లో కచ్చితంగా రాహుల్ గాంధీనే ఈ దేశానికి ప్రధాని అవుతారన్నారు.

## సాఫ్ట్ టెన్నిస్‌లో మహిళా జట్టుకు కాంస్యం

**కడప కార్పొరేషన్, మార్చి 23, ప్రభాతవార్త:**

ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ఈనెల 19 నుంచి 23 వరకు జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్ టెన్నీస్ సీనియర్ విభాగంలో ఏపీ తరుపున మహిళల జట్టు కాంస్య పతకం సాధించడం జరిగింది. ఈ జట్టులో కడప జిల్లాకు చెందిన జె.అభిగైల్ మన రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. అలాగే ఏపీ రాష్ట్ర సాఫ్ట్ టెన్నీస్ జట్టుకు కడప జిల్లాకు చెందిన అసోసియేషన్ సెక్రటరీ డి.రేవంత్ ఏపీ జట్టుకు కోచ్‌గా విధులు నిర్వహించడం జరిగింది. రాష్ట్ర జట్టు ఈ పోటీలలో పతకం రావడంతో ఈ ఏడాది గోవాలో జరిగే నేషనల్ గేమ్స్‌కు అర్హత సాధించి వెళ్లనుందని కోచ్ రేవంత్ పేర్కొన్నారు.

## గో సంరక్షణ సమితిని రూ.40వేలు వితరణ

**ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 22, ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు గోసంరక్షణ సమితి కి పాతకోట ఆనంద్ రెడ్డి కుమారుడు బలరాం రెడ్డి గోవుల ఆటోకు40 వేలు రూపాయలు గురువారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లవరం ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గోనా ప్రభాకర్ రెడ్డి, గోసంరక్షణ సమితి అధ్యక్షుడు శివనాగిరెడ్డి, సభ్యులు వై శ్రీకాంత్ రెడ్డి,ఎల్ మహేష్ రెడ్డి,కే రాజశేఖర్,ఫరూక్, రవి అక్రమ్ పాల్గొన్నారు.

## నేడు బహిరంగ వేలం పాటలు

**ముద్దనూరు మార్చి 23, ప్రభాతవార్త**

ముద్దనూరు గ్రామపంచాయతీకి సంబంధించిన బస్టాండు, జంతువదశాల, సులబ్ కాంప్లెక్స్ లకు నేటి సాయంత్రం మూడు గంటలకు బహిరంగ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు ముద్దనూరు గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసింహులు తెలిపారు.ఈ వేలం పాటలలో పాల్గొనాలనుకునేవారు సరిపడే డిపాజిట్ ను చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చు అన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడుదాం

**కడప ఎడ్యుకేషన్, మార్చి 23, ప్రభాతవార్త:**



భారతదేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సర్దార్ భగత్‌సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు, యువత ముందుకెళ్లాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ జయవర్ధన్ అన్నారు. సర్దార్ భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జయవర్ధన్ మాట్లాడుతూ జాతీయ భావాలు, పోరాట సాంప్రదాయం కలిగిన కుటుంబం సర్దార్ భగత్‌సింగ్‌ది అని కొనియాడారు. బ్రిటీష్ వలసదారుల దోపిడీ పరిపాలనను పారదోలి భారతదేశాన్ని విముక్తి చేయడం కోసం జరిగిన జాతీయ ఉద్యమంలో అనేక మంది బలిదానాలు చేశారని అందులో విప్లవ విద్యార్థి యువ జనులు తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించారన్నారు. ఇందులో భాగంగా చిరునవ్వుతో ఉరికంబాన్ని ముద్దాడిన సర్దార్‌భగత్‌సింగ్ ధైర్యసాహసాలను ఆయన కొనియాడారు. యువత ఆయన పోరాట స్ఫూర్తిని పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నాయకులు రవీంద్ర, శ్రీకాంత్, సతీష్ పాల్గొన్నారు.

## పోషకాలున్న ఆహారం తీసుకోవాలి

**కమలాపురం, మార్చి 23, ప్రభాతవార్త:**



గర్భవతులు, బాలింతలు, చిన్నారులు పోషకాలున్న ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయకుమారి తెలిపారు. మార్చి 20వ తేదీ నుంచి జరుగుతున్న 5వ పోషణ్ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక 7వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషక విలువలు అధికంగా ఉన్న ఆకు కూరలు, కూరగాయలు, పాలు, గుడ్లుతో పోషణ్ పక్వాడ లోగో ఏర్పాటు చేశారు. గర్భవతులు, బాలింతలకు పోషణ్ పక్వాడ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, చిన్నారుల్లో అనీమియా, రక్తహీనతను నివారించేం దుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నా రన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి, 1వ సచివాలయం పరిధిలోని అంగన్ వాడీ వర్కర్లు జ్యోతి, గౌసియా రాణి, కిరణ్‌కుమారి, ఎలిజబెత్ రాణి, క్రిష్ణవేణి పాల్గొన్నారు.

## కబ్జాదారుల ఆగడాలను అరికట్టండి

**కడప కార్పొరేషన్, మార్చి 23, ప్రభాతవార్త:**



భూ కబ్జాదారుల నుంచి పేదలను కాపాడాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ పెద్దపల్లి శేఖర్ అధికారులను కోరారు. వైసీపీ నాయకుల ఆగడాలు మితిమీరుతున్నాయన్నారు. గురువారం కడప నగరంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రూ.కోట్లు విలువ గల భూమిపై కొంత మంది వైసీపీ నాయకుల కన్ను పడిందన్నారు. రాయచోటిలోని మాసాపేటలో సర్వే నెంబరు 242లో 2.08 ఎకరాల భూమిని ఆక్రమించుకునేందుకు వైకాపా నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ భూమికి సంబంధించి పేదలకు ఇళ్ల పట్టాల కోసం వామపక్ష నాయకులు పోరాటాలు చేశారని తెలిపారు. పేదలకు చెందాల్సిన ఈ భూమిని వైకాపా నాయకులు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పేదలకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. పేదల ఇళ్ల పట్టాల కోసం పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## మొక్కలే మనిషి మనుగడకు రక్ష

**- ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరాజు**

**రాయచోటి టౌన్, మార్చి 23ప్రభాతవార్త:**

మొక్కలే మనిషి మనుగడకు రక్ష అని ప్రధానోపాధ్యాయులు కొండూరు శ్రీనివాసరాజు అన్నారు. రాయచోటి పట్టణంలోని స్థానిక నేతాజీ సర్కిల్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాసరాజు, ఎన్జీసి క్లస్టర్ కోఆర్డినేటర్ తౌఫీక్ అలీ, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు నాగరాజు , పవన్ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవ వైవిధ్యంతో మనిషి మనుగడ సాగించాలని మొక్కల పెంపకం ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, సీనియర్ ఉపాధ్యాయులు, రాజా, ఇతర ఉపాధ్యాయులు, బోదనేతర సిబ్బంది తదితరులు పాల్గొనా న్నరు.

## చలివేంద్రాలు ప్రారంభం

**కమలాపురం, మార్చి 23, ప్రభాతవార్త:**

కమలాపురం నియోజకవర్గ పరిధి లోని కమలాపురం మార్కెట్ కమిటీ తనిఖీ కేంద్రం వద్ద గురువారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎన్.సి.పుల్లారెడ్డి, కార్యదర్శి ఎన్.వరప్రసాద్‌రెడ్డి వేసవి కాలం ఆరంభమైనందున వాహనదారుల, ప్రజల సౌకర్యార్థం మంచినీటి చలి వేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుల్లారెడ్డి మాట్లా డుతూ ఈ వేసవి అంతా చలివేంద్రాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## అంగన్వాడీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**ముద్దనూరు మార్చి 23, ప్రభాతవార్త**

ముద్దనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ముద్దనూరు, కొండాపురం, మైలవరం మండలాలలోని అంగన్వాడీ కేంద్రాలలో, ఖాళీగా ఉన్న అంగన్వాడి కార్యకర్తలు, అంగన్వాడి సహాయకుల పోస్టులకు, అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ముద్దనూరు ఐసిడిఎస్, సిడిపిఓ ముంతాజ్ బేగం తెలిపారు.ఈ మేరకు కొండాపురం మండలంలోని బొమ్మే పల్లెలో అంగన్వాడీ కార్యకర్త పోస్టు, అలాగే ఇదే మండలంలోని ఏటూరు గ్రామంలో అంగన్వాడి సహాయకురాలు పోస్టు , ఇకపోతే మైలవరం మండలంలోని మైలవరం2 లో అంగనవాడి సహాయకురాలు పోస్టు, ఇదే మండలంలోని కంబాలదిన్నె గ్రామంలో అంగన్వాడి సహాయకురాల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఇకపోతే ముద్దనూరు మండలంలోని చిన్నవిద్యాల గ్రామంలో అంగన్వాడి సహాయకురాలు పోస్ట్ ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఖాళీల భర్తీని రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేయడం జరుగుతుందన్నారు.అర్హులైన వారు, ఈనెల 27వ తేదీ సాయంకాలం ఐదు గంటల లోపు,ముద్దనూరు ఐసిడిఎస్ ఆఫీసులో తమ దరఖాస్తులను అందివ్వాలని సిడిపిఓ ముంతాజ్ బేగం తెలిపారు.

## వైభవంగా గంగమ్మ జాతర

**కురబలకోట, మార్చి 23 ప్రభాతవార్త:**



మండలంలోని ఎర్రబల్లి గ్రామ పంచాయితీ పరిధిలో సింగన్నగారిపల్లెలో వెలసిన చిన్నతోట గంగమ్మ జాతర గురువారం రాత్రి వైభవంగా జరిగింది. బుధవారం అమ్మవారికి మహిళలు భారీ సంఖ్యలో దీలు బోణాలు భక్తిశ్రద్ధలతో పట్టారు. ఆలయం వద్ద సర్పంచ్ నాగరత్న ఈశ్వర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు. జాతరకు కురబలకోట, బి.కొత్తకోట, పిటిఎం, మొలకలచెరువు కర్నాటక సరిహద్దు ప్రాంత ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకొన్నారు. రాత్రి సింగన్న గారి పల్లె, కంటేవారిపల్లె, బాపనపల్లె, రేగడ గ్రామాలకు చెందిన ప్రజలు చాందీని బండ్లు కట్టి, పిల్లన్నగ్రోవి, కోలా టాలు, భజనల ద్వారా అమ్మవారిని ఊరేగించారు. ఈ జాతరలో అధికసంఖ్యలో ప్రజల పాల్గొన్నారు. మదనపల్లె డిఎస్‌పి కేశప్ప ఆధ్వర్యంలో రూరల్ సిఐ శివాంజనేయులు, ముదివేడు ఎస్ఐ సుకుమార్ గట్టిబందోబస్తు నిర్వహించారు.

## పిచ్చికుక్కదాడిలో చిన్నారికి గాయాలు

**మదనపల్లెక్రైం, మార్చి 23 ప్రభాతవార్త :**

పిచ్చికుక్క దాడిలో చిన్నారి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతోంది. పిటిఎంకు చెందిన అంజి, సుశీల కుమార్తె దీక్షిత(3) గురువారం ఉదయం ఇంటి ముందు ఆడుకుటుండగా పిచ్చికుక్క దాడిచేసింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు గుర్తించి కుక్కపై దాడిచేయడంతో పరారైంది. తీవ్రంగా గాయపడిన బాలికను కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్సలు పొందుతోంది.

## లింగనిర్ధారణ పరీక్షలు నేరం

**లింగనిర్ధారణ చట్టవ్యతిరేక అధికారి దేవశిరోమణి**

**మదనపల్లెక్రైం, మార్చి 23 ప్రభాతవార్త :**



ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రైవేటు అసుపత్రులను నిర్వహించాలని గర్భస్థ పిండ లింగనిర్ణారణ చట్టవ్యతిరేక జిల్లా అధికారిణి దేవశిరోమణి పేర్కొన్నారు. గురువారం జిల్లా ఆసుపత్రిలోని రక్తనిది కేంద్రంలో పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు స్కానింగ్ సెంటర్ల నిర్వాహ కులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణం లో అనధికారికంగా చాలా ఆసుపత్రులు నడుస్తున్నట్లు పేర్కొన్నారు. మదనపల్లెలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అన్ని కేసులకు చికిత్స అందిస్తె మరణాలకు కారకులవుతున్నారని మండిపడ్డారు. ఆసుపత్రులతో పాటు 59 స్కానింగ్ కేంద్రాలకు ప్రభుత్వం అనుమతి ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ దివాకర్, డాక్టర్లు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## అంగన్ వాడీ పోస్టులకు దరకాస్తుల స్వీకరణ

**గోపవరం,మార్చి 23 ప్రభాతవార్త;**

సిద్దవటం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిదిలో ఉన్న గోపవరం అట్లూరు మండలాలలో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ కార్యకర్తలు,అంగన్ వాడీ ఆయాల పోస్టులకై అర్హులైన వారు ధరకాస్తులను చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ జి,లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. నీరబ్బుల్లాయి పల్లె, ఎడబ్లిడబ్లి, ఎస్‌టి,ప్రాజెక్టు కాలనీ, ఎడబ్లిడబ్లి, బిసిసి,కాలనీ ప్రాజెక్టు ఎడబ్లిహెచ్, ఎస్‌టి, లక్కవారిపల్లె, ఎడబ్లిహెచ్, ఎస్‌టి, మహబుబ్‌నగర్–1 ఎడబ్లిహెచ్, ఎస్‌సి, సుమిత్రా నగర్–2, ఎడబ్లిహెచ్, ఎస్‌సి, గౌరీశంకర్‌నగర్ వార్డు 11,ఎడబ్లిహెచ్, ఎస్‌టి, అట్లూరుసోమేశ్వరపుర ంలో ఆయా పోస్టు ఈడబ్లిఎస్,పై ఎడబ్లిసి నందు ఖాళీలకుఈ నెల 27 తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## బసవయ్య మృతి పార్టీకి తీరని లోటు

**పీలేరు, మార్చి 23, ప్రభాతవార్త:**



కలికిరి మండలంలో ఫత్తేగత గ్రామం కొటాల నందు వైఎస్సార్‌సీపీ నాయకులు వాసునూరి బసవయ్య అనారోగ్య కారణంగా మరణించారు. విషయం తెలుసుకున్న ఏపీఓఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## జూదం ఆడుతున్న ముగ్గురు అరెస్టు

**మదనపల్లెక్రైం, మార్చి 23 ప్రభాతవార్త :**

జూదం ఆడుతున్న ముగ్గురిని గురువారం అరెస్టు చేసినట్లు రూరల్ సిఐ సత్యనారాయణ, ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వేంపల్లి పంచాయితీ కూకటి మానుగడ్డ వద్ద జూదం ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి రూ.2050 స్వాధీనం చేసుకొన్నామన్నారు. రూరల్ మండలంలో ఎక్కడైనా కోడిపందాలు, జూదం, ఆడుతుంటే తమకు స్థానికులు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## భార్యపై హత్యాయత్నం

**మదనపల్లెక్రైం, మార్చి 23 ప్రభాతవార్త :**

కుటుంబ గొడవల్లో ఆవేశానికి గురై భర్త కత్తితో భార్యపై దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు పట్టణంలోని ఏవినాయుడు కాలనీకి చెందిన సందీప్‌కుమార్ భార్య షహనాజ్‌కు ఇద్దరు పిల్లలు కలరు. ఐదు నెలల క్రితం దంపతులు కటుంబ సమస్యలపై గొడవపడడంతో భార్య పిల్లలను తీసుకొని పుట్టింటికి బెంగుళూరుకు వెళ్ళింది. పండగ కోసం మూడు రోజుల క్రితం పిల్లలను పిలుచుకొని మదనపల్లెకు వచ్చింది. అయితే మదనపల్లెలో ఇల్లు ఖాళీ చేసి బెంగుళూరుకు వెళ్ళిపోవాలని బుధవారం రాత్రి పట్టుబట్టింది. భర్త అంగీకరించక పోవడంతో దంపతుల మధ్య గొడవ జరిగి ఆవేశానికి గురైన సందీప్ కత్తితో భార్యపై దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఘటనలో ఆమె తీవ్రం గా గాయపడింది. గమనించిన స్థానికులు బాధితురాలిని జిల్లా ఆసుపత్రికి తర లించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రెండవ పట్టణ పోలీసులు తెలిపారు.

## కాంగ్రెస్ కార్యకర్తలు టిడిపిలోకి చేరిక

**నిమ్మనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :**



మండల కేంద్రమైన నిమ్మనపల్లెలో గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చంద్రాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా కాంగ్రెస్ పార్టీనుంచి టిడిపిలో చేరడంతో స్థానిక యువ కాంగ్రెస్ నాయకులు చెంద్రాయుడు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండులోని అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు భారీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటేష్, రమణ, రామ క్రిష్ణ, మల్లప్ప, రాజన్న పాల్గొన్నారు.

## తెలుగు సంవత్సరంలో తెలుగుదేశంకు అన్ని శుభాలే

**నిమ్మనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :**



నూతన సంవత్సరంలో తెలుగుదేశం పార్టీకి అన్ని శుభాలే జరుగుతున్నాయని రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ బిసి అధికార ప్రతినిధి లక్ష్మన్న అన్నారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం తరపున అనురాధా గెలవడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా ఆయన హర్షం తెలుపుతూ రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబును చూడాలని కార్యకర్తలకు సూచించారు.

## అబ్బో...అతిపెద్ద చేప

**రామసముద్రం, మార్చి 23 ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని కారణాల వీధిలో వెలసిన బెస్త నాగరాజు, అనంద కుమార్, బాలక్రిష్ణ, శెట్టి శ్రీనివాసులు, కుమ్మరిశంకరప్ప వీరంతా కలసి గురువారం పుంగనూరుకు రోడ్డులో కుదురుచీమనపల్లె వద్ద గార్గేయనది కాలువలో చేపల వేటకు వెళ్ళారు. అక్కడ కాలువలో వీరు వేసిన వలలో అతిపెద్ద చేపను పట్టారు. ఈ చేప దాదాపు 10కిలోల వరకు ఉన్నట్లు వారు తెలిపారు. ఈ చేపను చూడడానికి స్థానికులతో పాటు చుట్టుపక్కల ప్రజలు చూసి ఆశ్చర్య పోతున్నారు. ఇటీవల వర్షాలు బాగా పడడంతో చెరవులు, కుంటలు, కాలువలు నీరు భారీగా చేరి భారీగా చేపలు వృద్ధి చెందాయి.

## యువతకు స్ఫూర్తి భగత్‌సింగ్

**కడప ఎడ్యుకేషన్, మార్చి 23, ప్రభాతవార్త:**



దేశ స్వాతంత్ర్య పోరాట యోధుడు యువతకు ఆదర్శ ప్రాయుడైన భగత్ సింగ్ విగ్రం ఏర్పాటు చేయాలని ప్రొగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కాలేజీలో భగత్‌సింగ్ 92వ వర్ధంతి సభ నిర్వహించి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్యం అంటే జెండా మారడం కాదు, ప్రజలపై జరిగే అన్ని రకాల దోపిడీ అంతం కావడమని దేశ ప్రజలకు స్పష్టం చేశాడని గుర్తు చేశారు. పాఠ్యాంశాల్లోకి కాషాయీకరణను మూఢ విశ్వాసాలను, చరిత్ర వక్రీకరణను ప్రవేశపెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విలీనం, తెలుగు మాధ్యం రద్దు, ఎయిడ్ విద్యా ప్రైవేటీకరణ లాంటి అనేక విద్యా సంస్కరణల పేరుతో విద్యకు ఉరితాళ్లు బిగిస్తూ విద్యార్థుల జీవితాలలో చెలగాటం ఆడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కరవు భత్యం వెంటనే ప్రకటించాలి

**జమ్మలమడుగు, మార్చి 23, ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయు లకు రావాల్సిన 3 డీఏలు మరియు డీఏ పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందిళ్ల సుబ్బరాజు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో ఎస్టీఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి కానుకగా డీఏని ప్రకటిస్తామని ఉగాది పండగ దాటిపోయినా ఇంత వరకు దాని ఊసే లేదని ఇకనైనా ఆలస్యం చేయకుండా ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన మూడు డీఏలు అందే విధంగా అలాగే 2018 జులై నుంచి రావాల్సిన కరవు భత్యం బకాయిలు, పీఆర్సీ అరియర్స్‌ను చెల్లించాలని రిటైర్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలన్నీ చెల్లించాలని మరియు పీఎఫ్ లోన్లు వెంటనే జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామాంజనేయులు, వైస్ ప్రెసిడెంట్ టి.మురళీ, నాయకులు చీమల శ్రీనివాసులు, వెంకటేష్, కె.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులు చిరుధాన్యాలు పండించాలి

**– వ్యవసాయ శాఖ బద్వేలు డివిజన్ ఏడీఏ ఎం.నాగరాజు**

**సిద్దవటం, మార్చి 23, ప్రభాతవార్త:**



రైతులు చిరుధాన్యాల పంటలు పండించాలని వ్యవసాయశాఖ బద్వేలు డివిజన్ ఏడీఏ ఎం.నాగరాజు రైతులకు సూచించారు. మండలంలోని టక్కోలు రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రంలోని ఎరువులు, రిజిస్టర్లను పరిశీలించారు. దేగనవాండ్ల పల్లె, లింగంపల్లె, కడపాయపల్లె గ్రామాల్లోని నువ్వులు, పొద్దు తిరుగుడు, కొర్ర పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ రైతులకు ఈ సంవత్సరం చిరుధాన్యాలైన కొర్ర, రాగి, అండుకొర్రలు, సాములు, సజ్జలు వంటి పంటలను పండించాలని రైతులకు సూచించారు. అంతే కాక ఈ ఏడాది జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం జరిగిం దన్నారు. ఆసక్తి గల రైతులందరూ చిరుధాన్య పంటలను సాగు చేయాలని రైతు లకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.రమేష్‌రెడ్డి, రైతు భరోసా కేంద్ర ఇన్‌ఛార్జి వంశీ, రైతులు పాల్గొన్నారు.

## జనసేన నాయకుడికి స్వాగతం

**సిద్దవటం, మార్చి 23, ప్రభాతవార్త:**



రాజంపేట జనసేన పార్టీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ విదేశాల నుంచి తిరిగి రాజంపేటకు వస్తుండగా గురువారం సిద్దవటం మండల పరిధి ఉప్పరపల్లె గ్రామం వద్ద జనసేన రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మలిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ ముందుగా రాజంపేట నియోజకవర్గ ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. జనసేన రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న పవనన్న ప్రజా బాట సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లో దిగ్విజయంగా కొనసాగిస్తున్న జన సైనికు లకు, వీర మహిళలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే 2024 ఎన్ని కల్లో ప్రజలందరూ జనసేనను ఆదరించి పవన్ కల్యాణ్‌ను సీఎం చేసుకోవాలన్నారు. జనసేన పార్టీ అధిష్ఠానం ఆమోదిస్తే రాజంపేట నియోజకవర్గానికి జనసేన పార్టీ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బండి లక్ష్మీదేవి, లీగల్‌సెల్ కత్తి సుబ్బరాయుడు, జనసేన నాయకులు భాస్కర్ పంతులు, పోలిశెట్టి చంగల్‌రాయుడు, శ్రీనివాసులు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## తెదేపా ఆధ్వర్యంలో సంబరాలు

**పెండ్లిమర్రి, మార్చి 23, ప్రభాతవార్త:**



రాష్ట్ర తెదేపా నాయకురాలు పంచమర్తి అనురాధ ఎమ్మెల్సీగా గెలుపొందిన సందర్భంగా పెండ్లిమర్రి మండలం తెదేపా ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రమైన పెండ్లిమర్రిలో స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సంగటి గంగిరెడ్డి, యువత అధ్యక్షులు రామ లింగారెడ్డి, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి రఘునాథరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలపై సమీక్ష

**దువ్వూరు, మార్చి 23, ప్రభాతవార్త:**



మండల పరిధిలో జగనన్న పక్కా గృహాల నిర్మాణాలపై గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో మండల స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇందులో ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి ఓబులేసు నందన్, తహసీల్దారు రమాకుమారిలు పాల్గొని మాట్లాడుతూ గ్రామ సచివాలయ పరిధిలో ఇచ్చిన లక్ష్యాలను సాధించాలన్నారు. జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తోందని కావునా గ్రామ స్థాయిలో పనిచేసే వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీ రింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది సమిష్టిగా లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయాల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలు కోల్పోయిన వారికి పరిహారం అందిస్తాం

**లక్కిరెడ్డిపల్లె, మార్చి 23, ప్రభాతవార్త:**

జాతీయ రహదారికి లక్కిరెడ్డిపల్లెలో ఇరు పక్కల ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందిస్తామని అన్నమయ్య జిల్లా ఆర్డీవో రంగస్వామి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఇళ్లు కోల్పోయిన 120 మంది బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం చదరపు గజానికి రూ.4563 అందిస్తామని ఆయన బాధితులకు తెలిపారు. అలాగే రోడ్డుకు ఎక్కువ స్థలాలు కోల్పోయి పూర్తి స్థాయిలో ఇళ్లు కోల్పోయిన వారికి కలెక్టరుకు దరఖాస్తు చేసఉకోవచ్చన్నారు. పూర్తిగా పరిశీలించి ఎవరిని ఇబ్బందులు పెట్టకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందిస్తామని ఆయన తెలిపారు. 120 మంది డాక్యుమెంట్లను ఆయన పరిశీలించారు. అందరూ పూర్తిగా ఒప్పుకున్నాకే రోడ్డు పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఎవరైనా అభ్యంతరాలుంటే తెలుపుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహసీల్దారు నరసింహులు, నేషనల్ జాతీయ రహదారి ఏఈ రఘునాథ్, సర్వేయర్ కరీముల్లా, ఆర్ఐ సమ్మతకల్, బాధితులు పాల్గొన్నారు.

## పబ్లిక్ నోటీసు

**భాగస్వాముల పదవీ విరమణ**

శ్రీ రాగిళ్ల శ్రీనివాసులు, S/o Mr. R. రామమూర్తి మరియు Mr. రాగిళ్ళ రమకృష్ణ, S/o Mr. R. రామమూర్తి, జనవరి 31, 2023 నుండి కంపెనీ క్రియాశీల భాగస్వాములుగా పదవీ విరమణ పొందారని మేము తెలియజేస్తున్నాము.

M/s. శివాని షాపింగ్ మాల్ వారి రిజిస్టర్డ్ (45 of 2019) కార్యాలయం D.No. 37-1-203, బాపూజీ మార్కెట్ ఎదురుగా, ఒంగోలు – 523001, ప్రకాశం జిల్లా మరియు నెల్లూరు (SPSR నెల్లూరు జిల్లా.), కావలి (SPSR నెల్లూరు జిల్లా.), తిరుపతి (శ్రీ బాలాజీ జిల్లా.) మరియు కడప (YSR కడప జిల్లా) లో శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఈ నోటీసుకు సంబంధించి ఏదైనా వ్యక్తి, కంపెనీ లేదా సంస్థకు ఏదైనా అభ్యంతరం ఉంటే, ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి ఏడు (7) రోజులలోపు దయచేసి పేర్కొన్న సంస్థను సంప్రదించండి. ఏడు (7) రోజుల వ్యవధి ముగిసిన తర్వాత, ఎటువంటి అభ్యంతరం ఆమోదించబడదు లేదా ఆమోదం పొందదు మరియు సంస్థ మరియు పైన పేర్కొన్న రిటైర్డ్ భాగస్వాములు ఏ విధంగానూ దేనికి బాధ్యత వహించరు.

## నేటి నుంచి రంజాన్ ఉపవాసదీక్షలు

### పట్టణంలో ముస్తాబైన మసీదులు

**మదనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :**



నేటి నుంచి రంజాన్ ఉపవాసదీక్షలు ప్రారంభమవుతాయని మదనపల్లె జామీయా మసీదు ఇమామ్ హజరత్ జలాలుద్దీన్ తెలిపారు. శుక్రవారం వేకువ జాము నుంచి ఈ ఉపవాసదీక్షలు ప్రారంభం అవుతాయన్నారు. రంజాన్ సందర్భంగా పట్టణంలోని మసీదులు విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. గురువారంతో షాబాన్ మాసం పూర్తి అవుతుండడంతో తదుపరి రంజాన్ మాసం ప్రారంభం అవుతుంది. శుక్రవారం వేకువజామున సహరీ పూర్తి చేయాల్సిన సమయం 5.07గంటలు కాగా ఉపవాసదీక్ష విరమించాల్సిన సాయంత్రం 6.32గంటలకని హాజరత్ తెలిపారు. పట్టణంలో ప్రధానంగా బెంగుళూరు బస్టాం డులోని జామియా మసీదు, ఎన్‌వీఆర్ వీధిలోని మోతీనగర్ మసీదు, ఇంద్రా నగర్ మసీదుల్లో రంజాన్ మాసం అన్ని రోజులు సహరి ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మసీదుల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మసీదుల్లో పర్యటించి సౌకర్యాలను అడిగి తెలుసుకొన్నారు.

## అసెంబ్లీలో ఎమ్మెల్యేలపై దాడి హేయమైన చర్య

### మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**మదనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :**



అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యేలపై దాడి చేయడం హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా అరాచకాలు రోజు రోజుకు ఎక్కువ అవుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కూడా ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ముఖ్యంగా చేనేతలకు అన్ని విధాల నష్టం జరుగుతుందన్నారు. వారు నేసిన చీరలకు డిమాండ్ లేకపోవడంతో చేనేతలు ఆర్థికంగా కూడా నష్టపోతున్నారన్నారు. రాష్ట్రంలోనే నీరుగట్టువారిపల్లె చేనేత వ్యాపార లావాదేవీలకు పేరు పొందిం దన్నారు. పట్టుచీరలకు డిమాండ్ లేకపోవడం వల్ల సుమారు లక్ష చీరల వరకు చేనేతల వద్ద మగ్గుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పట్టుచీరలు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అయ్యేలా చర్యలు తీసుకొని నేతన్నలను ఆదు కోవాలని కోరారు. సిల్క్‌ను సబ్సిడీ రూపంలో పంపిణీ చేసి నీరుగట్టువారిపల్లె చీరలకు బ్రాండెడ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు షోయాప్ శీన, నాగూరువల్లి, నేతన్నలు పాల్గొన్నారు.

## వైభవంగా చౌడేశ్వరీదేవి వేడుకలు

**మదనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :**



పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో రెండు రోజులుగా శ్రీ చౌడేశ్వరీ దేవి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అమ్మవారిని ప్రముఖ పారిశ్రామికవేత్త బోడె రామచంద్రయాదవ్ దర్శించుకొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను స్వాగతించారు. అనంతరం గోవర్థనగిరిలో వెలసియున్న శ్రీక్రిష్ణ ఆలయానికి విచ్చేసి కృష్ణున్ని దర్శించుకొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి కమిటీ సభ్యులచే సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యు లు మాట్లాడుతూ శ్రీక్రిష్ణ ఆలయ అభివృద్ధికి రామచంద్రయాదవ్ చేసిన సహాయ సహకారాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు పాలరమేష్ యాదవ్, ఉత్తన్న, వీరభాస్కర్, బొగ్గు వంశీ, భాస్కర్, రాజు, శ్యామ్, ఆనంద్, హరీ, యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి

**కడప కార్పొరేషన్, మార్చి 23, ప్రభాతవార్త:**



జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే నేతలు జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజును గురువారం కలిసి వినతిపత్రాన్ని అందించారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిందిగా కోరారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కూడా విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు కాలనీలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు జిల్లా కలెక్టరు స్పందిస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న జర్నలిస్టులకు తన వంతు సహకారం అందిస్తానని భరోసా కల్పించారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు విషయంపై సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకుడు రామసుబ్బారెడ్డి, ఇతర నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో నృత్య సందడి

**పులివెందుల టౌన్, మార్చి 23, ప్రభాతవార్త :**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించు కుని రెండోరోజు గురువారం ప్రసాద్‌కోలా ఆర్థిక సహకారంతో విజయవాడ ఎక్స్ లెంట్ ఇన్‌స్టిట్యూట్ నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ చిన్నారులచే మాస్టర్ చిట్టి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నువ్వొస్తాంటే నేనొద్దంటానా, స్వాతిలో ముత్యమంత ముద్దుల ముట్టుకుంది సంధ్య వాన, ఆటకావాలా స్వచ్ఛమైన అచ్చతెలుగు బీటు కావాలి, వానవల్లప్ప వల్లప్ప ఒళ్లప్ప గించే సామింగా పాటలకు నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రేక్షకుల నుండి విపరీతమైన స్పందన వచ్చింది. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు చిట్టి, ప్రసాద్‌కోలా, పరిపాలనాధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆహార సాంకేతిక కళాశాలలో ఉగాది సంబరాలు

**పులివెందుల రూరల్, మార్చి 23, ప్రభాతవార్త :**



పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో ఉగాది సంబరాలు నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ ఎస్.ఎస్.బేగ్ ఆధ్వర్యం లో నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థిని, విద్యార్థులు సాంప్రదాయ వస్త్రాలలో కనిపించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల డీఎన్, సిబ్బంది స్వయంగా ఉగాది పచ్చడిని తయారు చేయడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఉగాది ప్రాముఖ్యతను, విద్యార్థుల జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకుని వాటికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఏడుకొండలు, అరుణ, రాజేష్, జయమ్మ, నివేదిత, సాయి శ్రీనివాస్, రాజశేఖర్, పావని పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు

**వాల్మీకిపురం, మార్చి 23 ప్రభాతవార్తః**



స్థానిక వైద్య విధాన పరిషత్తు ప్రభుత్వ వైద్యశాలలో మౌళిక వసతుల కల్పన కోసం రూ.6లక్షలు నిధులు మంజూరైనట్లు ఏపీఎంఐడీసీ ఈఈ ధనుంజయరెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలోని మౌలిక వసతులను పరిశీలించి సమస్యలు ఉన్నచోట మంజూరైన రూ.6లక్షలు నిదులును ఖర్చు చేసి సమస్యలను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆసుపత్రిప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న 50 పడకలు ఆసుపత్రి నిర్మాణ పనునలు ఆయన పరిశీలించారు. అనంతరం సంబంధించిన గుత్తేదారునితో మాట్లాడారు. త్వరితగతిన పూర్తిచేసి భవనాలను ప్రభుత్వానికి అప్పగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ కరీముల్లా, జేఈముస్తఫా, సూపరింటెండెంట్ ఫైరోజా బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

## ముస్లిం మైనార్టీలను విభజించడం సరికాదు

**కడప వైద్యవిభాగం, మార్చి 23, ప్రభాతవార్త:**



కొందరు రాజకీయ లబ్ధి కోసం ముస్లిం మైనార్టీలను విభజించి పరిపాలిస్తున్నారని ఏపీ సున్ని మషిఖా వెల్ఫేర్ అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప నగరంలోని బుఖారియా మస్జీద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ లబ్ధి కోసం విభ జించి పాలించే విధంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. వెనకబడిన పేద ముస్లిం మైనార్టీలకు ఆర్థికంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం అన్నదమ్ముల్లా కలిసి ఉన్న ముస్లిం మైనార్టీలను, సయ్యద్, పఠాన్, షేక్, మొఘల్ అనే కులాల వారీగా కార్పొరేషన్ల పేర్లతో విభ జించడం సరికాదని హెచ్చరించారు. కార్యక్రమంలో జకాఉద్దీన్ సాహెబ్, సిరా జుద్దీన్ బుఖారీ, నిజాముద్దీన్ బుఖారీ, ప్రముఖ సంఘ సేవకుడు సయ్యద్ సలావుద్దీన్, ఖలీల్ సయ్యద్, జిలానీ బాషా, మగ్దుం బుఖారీ, జాకీర్ మౌలానా, మగ్బుల్, ప్రముఖ ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## జర్నలిస్టు శ్రీనాథరెడ్డికి నివాళి

**ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 22, ప్రభాతవార్త**



సీనియర్ జర్నలిస్టు దేవిరెడ్డి శ్రీనాథ రెడ్డి మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటని ప్రొద్దుటూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో వారు దేవిరెడ్డి శ్రీనాథ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాత్రికేయులు మాట్లాడుతూ దేవిరెడ్డి శ్రీనాథ రెడ్డి గత 40 సంవత్సరములుగా పాత్రికేయ రంగంలో కొనసాగుతూ, యూనియన్ నాయకులుగా పనిచేసిన ఆయన నేడు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

## దేశ యువతకు భగత్‌సింగ్ జీవితం ఆదర్శం

**ఖాజీపేట మార్చి 22, ప్రభాతవార్త**



భారతదేశ యువతకు భగత్ సింగ్ జీవితం ఆదర్శం కావాలని టిడిపి ఖాజీపేట మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. గురువారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఖాజీపేటలో భగత్ సింగ్ పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం ఆయన భగత్ సింగ్ జీవితం గురించి మాట్లాడుతూ భారత, బ్రిటన్ రాజకీయ ఖైదీలకు సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ జైలులో 64 రోజుల నిరాహారదీక్షను చేపట్టడం ద్వారా సింగ్ విపరీతమైన మద్దతును కూడగట్టుకున్నాడు. ఆయన జీవితం ఇప్పటి భారతదేశ యువతకు ఆదర్శప్రాయం కావాలన్నారు. కార్యక్రమంలో ఐటిడిపి ఖాజీపేట మండల అధ్యక్షుడు పాపన మల్లికార్జున రెడ్డి, సారే పిచ్చి నాయుడు, మామిళ్ళ కృష్ణారెడ్డి, నంద్యాల సుబ్బయ్య యాదవ్, దాసరి శ్రీనివాసులు, రామసుబ్బయ్య, మామిళ్ళ నాగసుబ్బారెడ్డి సుబ్బ రాయుడు, రామచంద్ర రెడ్డి పాల్గొన్నారు

## పత్రిక అస్థిత్వాన్ని పరిరక్షించాలి

**ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 22, ప్రభాతవార్త**



పత్రికా స్వేచ్ఛను, పత్రికా రంగ అస్థిత్వాన్ని పరిరక్షించాలని ప్రొద్దుటూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు కోరారు. గురువారం సేవ్ జర్నలిస్ట్ డే సందర్భంగా ఇండియన్ జర్నలిస్టు యూనియన్ పిలుపు మేరకు ప్రొద్దుటూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పత్రికాస్వేచ్ఛను, పత్రికా రంగ అస్థిత్వాన్ని పరిరక్షించాలని, పాత్రికేయులకు వృత్తి భద్రతా, వేతన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

## షార్టు ఫిలిం పోటీలో మిట్స్ విద్యార్థుల ప్రతిభ

**కురబలకోట, మార్చి 23 ప్రభాతవార్త:**



మిట్స్ కళాశాలకు చెందిన బిటెక్ విద్యార్థులు షార్ట్‌ఫిలిం పోటీలలో ప్రతిభ కనపరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. కలికిరి జేఎంటీయు యూనివర్శిటి కళాశాలలో జాతీయ స్థాయిలో నిర్వహించిన షార్ట్‌ఫిల్మిం పోటీలలో బిటెక్ చదువుతున్న బాషా, సద్దాం, నిరంజన్, సుభాన్, నందిని, శ్రీకాంత్ మెకానికల్ అసిస్టెంట్ ప్రొపెసర్ అమృతపాండేలు, జయప్రకాష్‌లు రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన కొరకై వేగం అనే షార్ట్‌ఫిలింను తీసి ఈ పోటీలలో ప్రదర్శించారు. ఈ ఫిలిం చూసిన ప్రతి ఒక్కరిని కలిచివేసిందని ఇందులో అతివేగం వల్ల నష్టపోయిన కుటుంబాలు పడే వేదనను విద్యార్థులు కండ్లకు కట్టిన్లు చిత్రీకరించారని ఆయన తెలిపారు. ఈ ఫిలింకు జాతీయ స్థాయిలో మొదటి బహుమతి లభించిందని రూ.500బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఈడి కీర్తి నాదేళ్ళ. ప్రిన్సిపాల్, ఫిలిం మేకర్స్ క్లబ్ ఇన్‌చార్జ్ ఇలియాజ్‌అలి అభినందించారు.

## వైభవంగా శ్రీరాముడి బ్రహ్మోత్సవాలు

**వాల్మీకిపురం, మార్చి 23 ప్రభాతవార్తః**



అంగరంగ వైభవంగా వాల్మీకి క్షేత్ర శ్రీరాముడు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని తితిదే డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ అన్నారు. గురువారం స్థానిక పట్టాభి రామాలయంలో జడ్పీటీసీ సభ్యురాలు నిర్మల, సర్పంచి గంగులమ్మ తదితరులతో కలిసి ఆమె వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరిం చారు. ఈనెల 26వ తేదీ నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు తితిదే ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రారంభమవుతాయన్నారు. ఏప్రిల్ 1వ తేదీ శ్రీసీతా రాముల వారికి ఆరు బయట కళ్యాణం, రెండవ తేదీ పుష్పయాగంతో ఉత్స వాలు ముగియనున్నాయి. కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు చింతల ఆనందరెడ్డి, ఉప సర్పంచి కేశవరెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ భాస్కర్, సురేష్‌రెడ్డి, తితిదే అధికారులు ముని చెంగల్‌రాయులు, కష్ణమూర్తి, సిబ్బంది నాగరాజు దుష్యంత్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త నుంచి సంపదను సృష్టిద్దాం

**వాల్మీకిపురం, మార్చి 23 ప్రభాతవార్తః**



పంచాయతీ పరిధిలో పేరుకుపోయిన చెత్తను తొలగించడం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా చెత్త నుంచి సంపదను సృష్టిద్దా మని మదనపల్లె డీఎల్‌పీఓ జయకుమారి అన్నారు. గురువారం బోగంపల్లె మినీ రిజర్వాయర్ సమీపంలో తడిచెత్త, పొడిచెత్త తద్వారా సంపదనుఎలా పొందడం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎల్‌పీఓ మాట్లాడుతూ తడి చెత్త, పొడిచెత్త సేకరించడం ద్వారా ఎప్పటి కప్పుడు గ్రామాలు పరిశుభ్రంగా మారడమే కాకుండా సేకరించిన చెత్త ద్వారా సంపదను సష్టించడం తద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చడం పై ఆమె సమావేశానికి అవగామన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, సర్పంచి గంగులమ్మ, ఉప సర్పంచి కేశవరెడ్డి, కలికిరి, బి.కొత్తకోట, వాల్మీకిపురం, పంచాయతీల సర్పంచిలు సెక్రటరీలు, గ్రీన్ అంబాసిడర్‌లు, ఈఓ ఆర్‌డీలు శకుంతల, ఆజాద్, ఆర్‌డబ్ల్యూయస్ ఏఈ మిథున్, చక్రవర్తి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈఆర్ఎస్ఈఎం-2023 పోస్టర్ ఆవిష్కరణ

**ప్రొద్దుటూరు క్రైం, మార్చి 23, ప్రభాతవార్త:**



ఎన్‌ఐటీటీఆర్ చెన్నై వారి కొలాబిరేషన్‌తో సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మే 19, 20 తేదీల్లో నిర్వహించ నున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్సెస్ ఆన్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్ సైన్సెస్, ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ (ఈఆర్ఎస్ఈఎం-2023) పోస్టర్‌ను కళాశాల కరస్పాండెంట్ బసిరెడ్డి వీర కల్యాణ్‌రెడ్డి ఆవిష్కరించినట్లు ప్రిన్సిపల్ డా.పాండు రంగన్ రవి తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్, మేనేజ్‌మెంట్, బేసిక్ అండ్ సైన్సెస్ విభాగాలకు చెందిన పరిశోధనా పత్రాలను సమర్పించడానికి ఈ పోస్టర్‌ను విడుదల చేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ 26, 2023 పేపర్ సబ్‌మిషన్ పంపాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసి డెంట్ వీర కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పైరంగాలలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఓడీలు, ఏవో జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## భగత్‌సింగ్‌కు భారత రత్న ప్రకటించాలి

**ప్రొద్దుటూరు క్రైం, మార్చి 23, ప్రభాతవార్త:**



షహీద్ భగత్‌సింగ్‌కు భారతరత్న అవార్డును ప్రకటించాల్సిందే అని న్యాయ విద్యార్థి విభాగం నాయకుడు నాగరాజు గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని స్థానిక భాష్యం హైస్కూలులో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాగరాజు మాట్లాడుతూ 23 భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు అమరులైన రోజు మన దేశాన్ని రాజ్యాంగాన్ని మతోన్మాద శక్తుల దాడుల నుంచి పరిరక్షించుకొని సమైక్య ఆధునిక భారతాన్ని నిర్మించుకోవడానికి మనమంతా కలిసి కట్టుగా కదలాలని ఈ సందర్భంగా ప్రతిన పూనుదామన్నారు. భగత్ సింగ్ చేసిన త్యాగ పోరాటాలను ఈ సందర్భంగా అనేకం గుర్తు చేశారు. కార్యక్రమంలో న్యాయ విద్యార్థి విభాగం నాయకుడు నాగరాజుతో పాటు భాష్యం విద్యా సంస్థల ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ ఎస్.రాజేశ్వరిదేవి, హెడ్మాస్టర్ గంగాదేవి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, సీనియర్ అధ్యాపకులు రమణ, కార్యకర్తలు భాను ప్రకాష్, శ్రీను, శ్రీకాంత్‌తో పాటు భాష్య విద్యా సంస్థల అధ్యాపక బృందంతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## సేవ్ జర్నలిస్ట్‌డే వేడుకలు

**మైదుకూరు మార్చి 22, ప్రభాతవార్త**



మైదుకూరు స్త్రీ శక్తి భవనంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ మైదుకూరు నియోజక వర్గ విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మైదుకూరు రురల్ సి.ఐ.నరేంద్రారెడ్డి,డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున ,మునిసిపల్ కమిషనర్ రాముడు పాల్గొన్నారు. సి.ఐ నరేంద్రా రెడ్డి మాట్లాడుతూ బయపడ కుండా కష్టనష్టాలు అనుభవిస్తున్న జర్నలిస్ట్‌లకు అభినందనలు తెలిపారు. అన్ని విషయాలు జర్నలిస్ట్‌ల ద్వారా తెలుసుకుంటున్నామన్నారు. తర్వాత జర్నలిస్ట్ లం దరు ఆయనకు దుశ్శాలువతో సన్మానించారు. అనంతరం సేవ్ జర్నలిస్ట్ డే దినోత్సవాన్ని పురస్కరించుకొని మైదుకూరు నియోజకవర్గ ప్రింట్ ఎల క్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కొర్లెల క్రిష్ణ ఆద్వర్యంలో వెంకటశివ విజన్ ఐటెల్ ఆప్టికల్స్ సహకారంతో ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ యం.ఎస్ గురు అభిలాష్ ఆప్తమాలజికంటి వైద్య నిపుణులు విలేకరులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. కంటి అద్దాలు అవసరమైన వారికి 50 శాతం రాయితీతో అందించారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు మాజీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి మృతి పట్ల రెండు నిమిషాల పాటు మౌనం పాటిం చారు. కార్యక్రమానికి మునిసిపల్ కమీషనర్, మైదుకూరు నియోజక వర్గం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, విలేకరులు పాల్గొన్నారు.

## మహిళా కేంద్ర కారాగారంలో న్యాయ విజ్ఞాన సదస్సు

**కడప లీగల్, మార్చి 23, ప్రభాతవార్త:**

కడప మహిళా కేంద్ర కారాగారంలో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.కవిత న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఖైదీల కుటుంబ సభ్యులు పొందేందుకు న్యాయ సలహాలు న్యాయ సహాయం అందించడం, ఉచిత న్యాయ సహాయం, న్యాయ సహాయం రక్షణ సలహా వ్యవస్థను, పారా లీగల్ వాలంటరీలు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధి విదానాలు తెలిపారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, డాక్టర్ మరియు మహిళా ఖైదీలు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన మేయర్

**కడప వైద్యవిభాగం, మార్చి 23, ప్రభాతవార్త:**



వేసవిలో దాహం తీర్చడం ఎంతో పుణ్యమని కడప నగర మేయర్ కె.సురేష్ బాబు పేర్కొన్నారు. కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు ఔట్ గేటు వద్ద చిల్లీస్ రెస్టారెంట్ హర్షవర్దన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సురేంద్ర, అంజి, ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ చలివేంద్రాన్ని మేయర్ సురేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్లీస్ రెస్టారెంట్ యాజమాన్యం చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో పుణ్యకార్యమని ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు రావాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, నాగేశ్వరరెడ్డి, శ్రీరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

## అమ్మవారిశాలలో పంచాంగ శ్రవణం

**కడప వైద్యవిభాగం, మార్చి 23, ప్రభాతవార్త:**



కడప వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉగాది సందర్భంగా కన్యకా పరమేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఆలయంలో అమ్మవారిని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మునగా శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు ప్రత్యేక పూజలు, గణపతి పూజ, హోమాలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు మైలాపురం జగదీష్, కమిటీ సభ్యులు వెంకట రమ ణయ్య, వెంకటరమణ, వెంకట నరసింహులు, సుబ్బారావు పాల్గొన్నారు.

## విప్లవ వీరుడు భగత్ సింగ్

**వాల్మీకిపురం, మార్చి 23 ప్రభాతవార్తః**

విప్లవ వీరుడు భగత్‌సింగ్ అని హెచ్ఎం అమర్నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ పీవీసీ ఉన్నత పాఠశాల ఆవరణలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా సంస్థ అధ్య క్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ 907 సెప్టెంబరు 27వ తేదీ పంజాబ్‌లో జన్మించిన భగత్‌సింగ్ చిన్న వయస్సులోనే పోరాటపటిమన చూపి బ్రిటీష్ వారిని ఎదిరించేందుకు తన మిత్రులైన సుఖదేవ్, రాజ్‌గురులతో కలిసి స్వాతంత్ర్యం కోసం బ్రిటీషు వారిపై పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర, పురుషోత్తం, నాగరాజు, రవీంద్రారెడ్డి కల్పలత, సుమతి, నాగసులోచన, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు రోజువారి గేటు రుసుము ఎత్తివేయాలి

**మైదుకూరు మార్చి 22, ప్రభాతవార్త**



మైదుకూరు మున్సిపాలిటీ కార్యాలయం నందు మున్సిపల్ కమిషనర్‌కు ఏఐటియుసి నాయకులు ఆటో మరియు తోపుడుబండ్ల మీద రోజు వారి గేటు రుసుము వసూలు చేయడాన్ని వేత్తి వేయాలని కోరారు.. గురువారం స్థానిక మునిసిపల్ కమీషనర్ కె. రాముడుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరం నుండి నిలుపుదల చేయాలని వారు వినతి పత్రం సమర్పిం చారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏ.ఐ.టి.యు.సి. జిల్లా కార్యదర్శి పి.శ్రీరాములు, ఏ.ఐ. టి.యు.సి. మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి ఏ.వి.శివరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఒక మైదుకూరులో మాత్రమే ఈ విధమైన రుసుము వసూలు చేయడం దుర్మార్గకరమని అన్నారు. ఇకనైనా ఈ విధమైన రుసుమును వసూలు చేయడం నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో బి.కే.ఎం.యు. నాయకులు ఎస్.షావలి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బి.పీరయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ తోపుడుబండ్ల యూనియన్ నాయకులు ఖాదర్,మాబు హుస్సేన్, షాఫూన్ భాషా, ప్రసాద్, జయరాజ్, జబ్బీర్, నాగేష్, సురేష్, వలి, బాలు, రంతు భాషా, గౌస్, నరసింహా, నూర్ మొహమ్మద్ పాల్గొన్నారు.

## వైసిపి పతనానికి అనురాధ గెలుపుతో కౌంట్‌డౌన్

### సీనియర్ నేత జగన్‌రాజు

**రాజంపేట అర్బన్, మార్చి 23 ప్రభాతవార్త**



అధికారంలో ఉన్నామనే అహంకారం, ప్రజా వ్యతి రేకపాలన, లెక్కలేనితనంతో ఆధిపత్యతోరణి నిరంత రం సాగుతుందనుకున్న జగన్ సర్కార్‌కు ఎమ్మెల్సి ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి పంచుమర్తి అనురాధ గెలుపే కారణమని రాజంపేట నియోజకవర్గ టిడిపి సీనియర్ నేత జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. గురు వారం విలేకరులతో మాట్లాడుతూ అనురాధ ఎన్నికతో జగన్‌సర్కార్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో టిడిపి తూర్పు, పడమర ఉత్తర ఎమ్మెల్సి ఎన్నికల్లో విజయదుందుబి మోగించిన విషయం జగన్ సర్కార్ ప్రజా వ్యతిరేక పాలనకు అద్దంపట్టిందన్నారు. ఉపాధ్యాయ పట్టభద్రుల ఎన్నికల్లో కూ డా విజయం సాధించాల్సి ఉండగా దొంగ ఓట్ల జోరు, బరితెగించి ఇష్టారాజ్యంగా ఓటుకు నోటు పంచి ఎన్నికల్లో విజయం సాధించారే తప్ప ప్రజా స్వామ్యహితం గా జరిగి ఉంటే టిడిపిదే గెలుపు అన్నారు. తాజాగా ఎమ్మెల్యే ద్వారా ఎమ్మెల్సి ఎన్నికలో అన్నిస్థానాలకు జగన్ సర్కార్ పోటీచేయడం, అతి విశ్వాసానికి కార ణమన్నారు. ఆత్మసాక్షి ప్రబోదంతో పంచుమర్తి అనురాధను ఎమ్మెల్యేలు గెలిపిం చడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

### - జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

**కడప క్రైం, మార్చి 23, ప్రభాతవార్త:**



పోలీసు శాఖకు వెలకట్టలేని సేవలం దించి మరణించిన వారికి జిల్లా పోలీసు శాఖ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ భరోసా ఇచ్చారు. సిద్దవటం పీఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన కె.కొండయ్య (హెచ్‌సీ812) సతీమణి కె.సుభాషిణికి కార్పస్ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష ఆర్థిక సాయాన్ని గురువారం ఎస్పీ కార్యాలయంలో అందజేశారు. పోలీసు సంక్షేమంలో భాగంగా ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారి కుటుంబ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో డీపీవో జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వరి పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక పవిత్ర రంజాన్ మాసం

### - పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపిన తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

**కడప వైద్యవిభాగం, మార్చి 23, ప్రభాతవార్త:**



పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం ఆనందం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మాసంలో ముస్లిం సోదర సోదరీమణులంతా నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షతో నిష్టగా అల్లాను ఆరాదిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉన్న దాంట్లో ఎంతో కొంత దాన ధర్మాలు చేస్తారని సేవా దృక్పథానికి, సహనానికి ప్రతీకగా ఈ పండగను జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉంటుందని తెలిపారు.

## వ్యక్తి దారుణ హత్య

**ప్రొద్దుటూరు క్రైం, మార్చి 23, ప్రభాతవార్త:**



ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న అమృత నగర్ లో కురవ రాము అనే వ్యక్తిని గుర్తు తెలి యని వ్యక్తులు దారుణంగా హత్య చేసిన సంఘటన చోటు చేసుకుంది. కోనేటి కాల్వ వీధిలో నివాసం ఉంటున్న రాము అతని తమ్ముడు ఉగాది పండగ సందర్భంగా అమ్మవారికి దేవర నిర్వహిస్తుండగా బుధవారం కుటుంబ సభ్యులు, బంధువులంతా కలిసి జాతరలో పాల్గొన్నారు. అనంతరం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో అమృతనగర్‌లోని సబ్‌స్టేషన్ వీధి 18వ లైన్‌లో రక్తపు మడుగులో మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై సంజీవరెడ్డి పరిశీ లించి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## హత్య కేసులో భర్తకు యావజ్జీవ శిక్ష

**ప్రొద్దుటూరు క్రైం, మార్చి 23, ప్రభాతవార్త:**



2014లో వరకట్న వేధింపులతో జరిగిన వివాహిత హత్య కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయి మృతురాలి భర్త అయిన వక్కల సయ్యద్ హుసేన్(39)కు పలు సెక్షన్ల కింద యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2.10లక్షలు జరిమానా విధిస్తూ మొత్తాన్ని మృతురాలి మైనర్ కుమార్తెకు చెల్లించాలని 2వ అదనపు జిల్లా కోర్టు జడ్జి జి.ఎస్. రమేష్‌కుమార్ తీర్పు ఇచ్చారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణకుమార్ ఆధ్వర్యంలో కేసు విచారణకు సహకరించిన ప్రొద్దుటూరు వన్‌టౌన్, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినం దించారు. ప్రాసిక్యూషన్‌లో బలమైన వాదనలు వినిపించిన ముద్దాయికి శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాంప్రసాద్‌రెడ్డిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## రెడ్డెప్పరెడ్డి చేసిన సేవలు మరువబోం

**వాల్మీకిపురం, మార్చి 23 ప్రభాతవార్తః**

మండలంలోని చింతపర్తి పంచాయతీ మద్దెలచెరువుపల్లెకి చెందిన వైకాపా సీనియర్ నాయకులు రెడ్డెప్పరెడ్డి (65) మృతి బాధాకరమని రాష్ట్ర ఖనిజాభివద్ధి శాఖ డైరెక్టర్ హరీష్‌రెడ్డి అన్నారు. రెడ్డెప్పరెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న హరీష్‌రెడ్డి మద్దెలచెరువు పల్లెకు వెళ్లి రెడ్డెప్ప రెడ్డి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ధనుంజయరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, రమేష్, చెంగల్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన పెద్ద పీరయ్య స్వామి ఆరాధన

బ్రహ్మంగారి మఠం, మార్చి 23 ప్రభాతవార్త :



మండలంలోని ముడమాల పంచాయతీలో సిద్దయ్యగారి మఠంలో వెలసిన జగద్గురువులు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రియ శిష్యుడు శ్రీ సిద్దయ్య స్వామి కుమారుడు శ్రీ పెద్ద పీరయ్య స్వామి ఆరాధన మహోత్సవం గురువారం మహా ప్రసాద వినియోగంతో వైభవంగా ముగిసింది. ప్రతి యేడాది ఉగాది పండుగ రోజున జరపడం ఆనవాయితీగా వస్తుందని సిద్దయ్యస్వామి మఠం మఠాధిపతులు, శిష్య బృంధం పేర్కొన్నారు. స్వామివారికి రెండు రోజులుగా వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చిన్న వృషభరాజముల పోటీలు, పెద్ద వృషభరాజముల పోటీలు నిర్వహించగా చిన్న వృషభరాజముల యజమానులకు ప్రథమ బహుమతిగా 30,016 రూపాయలు, రెండవ బహుమతిగా 20,016 రూపాయలు, మూడవ బహుమతి 15,016 రూపాయలు, నాలుగవ బహుమతి 5,016 రూపాయలు చిన్న వృషభరాజముల యజమానులకు అందజేయడం జరిగింది. పెద్ద వృషభరాజుల రాతి దూలం ఎక్కువ దూరం లాగిన వృషభరాజముల యజమానులకు ప్రథమ బహుమతి రూ.75,016లును జడ్పీటీసి రామగోవిందరెడ్డి, రెండవ బహుమతి రూ.50,016లు గొడ్లవీటి రామసుబ్బారెడ్డి, మూడవ బహుమతి రూ.30,016లు కె.ఆచారి కొండయ్య సన్స్, నాలుగవ బహుమతి రూ.15,116లు బసిరెడ్డి దుగ్గిరెడ్డి, ఐదవ బహుమతి రూ.10,126లు ముత్యాల రామచంద్రారెడ్డి ద్వారా అందజేశారు. 16 మనుముల గుండు ఎత్తే పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.2500లు, రెండవ బహుమతి రూ.2వేలు, మూడవ బహుమతి రూ.1,116లు వంతున బహుమతులను అందజేయడం జరిగింది. సిద్దయ్యస్వాముల వారి మఠం నిర్మాణం జరిగి నేటికి సుమారు 282 సంవత్సరాలు జరిగిందని, దేవస్థానం శిథిలావస్థకు చేరినందు వలన భక్తుల కోరిక మేరకు ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని, ఎవరైనా భక్తులు విరాళాలు ఇవ్వదలచిన వారు ఇవ్వవచ్చని, అలాగే ఆరాధనకు వచ్చిన భక్తులకు అన్ని సర్వ మత అన్నదాన సత్రాల నందు భోజన సదుపాయాలు ఏర్పాటుచేయడం జరిగింది.

## సచివాలయ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

– ఎంపిడివో హైదర్‌వలీ

రామాపురం, మార్చి 23ప్రభాతవార్త:



గ్రామ సచివాలయ సిబ్బంది అంకితభావంతో పనిచేసి అటు ప్రజలకు ప్రభుత్వానికి మంచి పేరుతీసుకుని రావాలని మండల అభివృద్ధి అధికారి హైదర్‌వలి అన్నారు. ఆయన గురువారం మండలంలోని కుమ్మరపల్లి బండపల్లి చిట్లూరు గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధిసంక్షేమ పథకాలను ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేసేలా గ్రామ సచివాలయ సిబ్బంది తోడ్పడాలని అంతేకాకుండా ప్రతిరోజు బయోమెట్రిక్ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వేయాలని ఆయన సూచించారు. సచివాలయ రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా కోరిన కోర్కెలు తీర్చే కొంగ బంగారం మంచాలమ్మ తల్లి జాతర

రామాపురం, మార్చి 23ప్రభాతవార్త:



కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం మంచాలమ్మ తల్లి అని దేవస్థానం కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని రాచపల్లి గ్రామం గంగనేరు సమీపంలో వెలసిన శ్రీశ్రీశ్రీ మంచాలమ్మ తల్లి తిరుణాల మహోత్సవం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరుగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మంచాలమ్మ జాతర ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ విధియ ప్రారంభమై తదియతో ముగుస్తుంది. ఈ మంచాలమ్మ తల్లి రాచపల్లె గ్రామం కొవ్వూరువాండ్ల పల్లెకు చెందిన కొవ్వూరు ఆడబిడ్డగా ఎన్నో మహిమాన్వితమైన ఆడబిడ్డగా భావించి అమ్మవారిని గ్రామంలోని గంగనేరు కొవ్వూరు వాండ్లపల్లి రాళ్లపల్లిల మీదుగా ఊరేగింపు నిర్వహించి మంచాలమ్మ తల్లిని దేవస్థానానికి తీసుకుని వెళ్తారు. ఊరేగింపులో భాగంగా ప్రతి కుటుంబం అమ్మవారికి బాణాలు ముక్కుబడులను చెల్లించి మంచాలమ్మ పూజలు నిర్వహించి జాతరను ప్రారంభించారు. ఈ జాతర మహోత్సవానికి చుట్టుపక్కల జిల్లాల నుంచి ప్రజలు తండోప తండాలుగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ ముక్కులను తుడుచుకుంటారు. రాత్రికి అమ్మవారికి అమ్మవారికి చాందిని బండ్లు బాణాసంచా చెక్కభజనలు కోలాటాలు తదితర కార్యక్రమాలలో నిర వ్వహిస్తారు. తిరుణాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున వెళ్లి తిలకిస్తారు.

## ప్రైవేటు పాఠశాలల్లో దరఖాస్తుకు ఆహ్వానం

చిట్వేలి, మార్చి 23 ప్రభాతవార్త



ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆర్‌టిఇ యాక్ట్ 12(1)సి ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి చదువుతున్న ఎస్‌సి, ఎస్‌సి, ఎస్‌టి, బిసి వెనకబడిన ఒసి విద్యార్థులకు 25 శాతం రిజర్వేషన్ 2024 సంవత్సరం ప్రవేశాలకుగాను సిఎస్‌సి లాగిన్‌లో నమోదు చేసుకోవచ్చని చిట్వేలి మండల విద్యాశాఖ అధికారి మహేశ్వరరావు గురువారం పత్రికా ప్రకటనలో తెలియపరిచారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 13 వరకు ఈ లాగిన్ తెరవబడి ఉంటుందని, ఒకటో తరగతి చదివేందుకై ఈ అవకాశాన్ని అన్ని కేటగిరీలవారు ఉపయోగించుకోవచ్చని అన్నారు. మండల పరిధిలో అన్ని ప్రైవేటు పాఠశాలల వివరాలు సిఎస్‌సి లాగిన్‌లో పొందుపరిచి ఉన్నామని అన్నారు. ఇందులో నిరుపేదలు, హెచ్‌ఐవి బాధితులు, వికలాంగుల కోసం 5 శాతం, ఎస్‌సి వారికి 10 శాతం, ఎస్‌టి వారికి 4 శాతం, బిసి, ఇతర వెనుకబడిన కులాల వారికి 6 శాతం అవకాశం ఉంటుందని అన్నారు. వీరి ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతంలో 1,20,000, పట్టణ ప్రాంతాల్లో 1,44,000 రూపాయలు మించరాదని తెలిపారు. నమోదు చేసుకున్న పిల్లలను ఏప్రిల్ 13న మొదటి రౌండ్ లాటరీ ద్వారా ఎంపికవుతారని అలా ఎంపికైన విద్యార్థులు ఏప్రిల్ 15 నుంచి 21వతేదీ లోపల ఎంపిక చేసుకున్న పాఠశాలల్లో చేరాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికైన గ్రామీణ విద్యార్థులకు 6500, పట్టణ విద్యార్థులకు 8 వేలు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని విద్యాశాఖ అధికారి తెలియజేశారు.

## చిరుదాన్యాలతో ఆరోగ్యం

పుల్లంపేట, మార్చి 23 ప్రభాతవార్త



మండలంలోని పివిజిపల్లె పంచాయతి యువి అగ్రహారం అంగన్వాడి సెంటర్‌లో పోషక పక్వాడ్ కార్యక్రమాన్ని సర్పంచ్ కామాక్షి ఆధ్వర్యంలో అంగన్వాడి సూపర్‌వైజర్ నిర్మల నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ చిరుదాన్యాలు ఆహారంగా తీసుకోవడం వల్ల గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లల తల్లులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. రక్తహీనతకు గురికాకుండా మంచి ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు క్రిష్ణవేణి, ఉపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరపల్లె షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలపై నేడు విచారణ

– నిర్మాణాలు అక్రమమా.. సక్రమమా – కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలు
– రెండో నోటీసు జారీ చేసిన తహసీల్దార్

సిద్దవటం, మార్చి 23, ప్రభాతవార్త:



కడప – చెన్నై ప్రధాన రహదారిలో షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలపై తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఉప్పరపల్లె ప్రభుత్వ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాల విషయం శుక్రవారం సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో విచారణ కొనసాగనుంది. మొదటి నోటీసుకు ఎటువంటి వివరణ ఇవ్వకుండా ఉండడంపై 2వ నోటీసును షాపింగ్ కాంప్లెక్స్‌ల యజమానులకు జారీ చేశామని ఎమ్మార్వో గౌస్ తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్‌ల యజమానులకు స్థలాలపై ఉన్న హక్కు పత్రాలను, పంచాయతీ అనుమతులు తీసుకున్నారా లేదా అనే విషయంపై నేడు విచారణ జరుగుతుందని తెలిపారు. విచారణలో ప్రభుత్వ స్థలాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు అక్రమమా, సక్రమమా అనేది తేలనుంది. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు కావడంతో ప్రభుత్వ స్థలాలలో అక్రమ కట్టడాలు జరిగి ఉంటే తహసీల్దారు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనేది ఉత్కంఠ భరితంగా మారింది. ప్రభుత్వ భూములలో కట్టిన షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు అక్రమమని తేలితే రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతారా లేక తహసీల్దారు ప్రభుత్వ విధి నిర్వహణలో భాగంగా ప్రభుత్వ స్థలాలను కాపాడతారా అని మండల ప్రజలు గుసగుసలాడుతున్నారు.

## విద్యార్థి దశలోనే ఉత్తమమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, మార్చి 23, ప్రభాతవార్త: 2



విద్యార్థి దశ నుంచి విద్యార్థులు ఉత్తమమైన లక్ష్యాలను ఎంచుకోవాలని మనీషా విద్యా నికేతన్ కరస్పాండెంట్ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. పాఠశాలలో 27వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఉత్తమమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించడానికి కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంగ్లీష్ మీడియం గత 27 సంవత్సరాల క్రితం ప్రారంభించామని గతంలో కేరళ ఉపాధ్యాయులచే విద్యా బోధన అందించేవారమన్నారు. ఎంతో మంది విద్యార్థులు తమ పాఠశాలలో చదువుకొని పై చదువులకు వెళ్లి ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## విజయం సాధించిన అనురాధకు శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, మార్చి 23ప్రభాతవార్త:

అసెంబ్లీలో గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనూహ్యంగా అనురాధ 23 సీట్లు వచ్చి గెలవడం ఆనందించదగిన విషయం. గతంలో టిడిపి పార్టీ 23 సీట్లు గెలిచిందని ఎద్దేవా చేశారు. చివరికి అదే 23వ తేదీన అదే 23 ఓట్లతో పంచమూర్తి అనురాధ గెలుపొందారని టిడిపి నియోజకవర్గ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీలు ఓటమి ఈరోజు అనురాధ గెలుపొందడం వైసిపి ఆరాచక పాలనకు గొడ్డలిపెట్టు అని చెప్పుకొచ్చన్నారు. రాబోయే కాలంలో టిడిపి గెలిచి చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఇకనైనా వైసిపి ప్రభుత్వం రాజ్యాంగబద్దంగా నడుచుకుంటూ ప్రజలకు మేలు చేసే విధంగా ముందుకు పోవాలన్నారు.

### ముస్లిం మైనార్టీ సోదరులకు మంచి జరగాలి – మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రాయచోటి నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా అంతా మంచి జరగాలని రాయచోటి నియోజ.కవర్గం తెలుగుదేశం పార్టీ యువనాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ముస్లిం మైనార్టీ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీనాథ్‌రెడ్డికి నివాళి

రాజంపేట, మార్చి 23 ప్రభాతవార్త

సీనియర్ జర్నలిస్టు, రాష్ట్ర ప్రెస్‌అకాడమి మాజీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి మృతి పట్ల రాజంపేట 'వార్త' పత్రిక ఆర్‌సి సెంటర్‌లో వార్త విలేకరులందరూ నివాళులర్పించారు. ఆయన జర్నలిజంలో ఎంతో సీనియర్ అని, ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో జర్నలిస్టుగా చేరి అంచలంచెలుగా ఎదిగి రాష్ట్ర ప్రెస్ అకడామి ఛైర్మన్‌స్థాయికి చేరిన మహోన్నత వ్యక్తి అని పలువురు విలేకరులు కొనియాడారు. ఆయన కడపజిల్లా విలేకరుల సంఘానికి నాయకుడిగా ఉన్నకాలంలో విలేకరులకు ఎంతో న్యాయం చేశారని, వారు సమస్యలు పరిష్కరించడంలో ముందుండేవారని అన్నారు. ఏ విలేకరికి ఇబ్బంది కలిగినా ఆయన ముందుండి ఆ విలేకరి సమస్యను తీర్చేవారని, అలాంటి వ్యక్తి మృతిచెందడం విలేకరుల వ్యవస్థకే తీరని లోటు అని అంటూ శ్రీనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు.

## పాత్రికేయుల రక్షణకు కృషి చేయాలి

– ఏపియుడబ్ల్యుజె అధ్యక్షులు భూమిరెడ్డి వెంకటేశ్

బద్వేలు అర్బన్, మార్చి 23 ప్రభాతవార్త :



సేవ్ జర్నలిస్ట్ డే సందర్భంగా ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) పిలుపు మేరకు గురువారం పట్టణంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు భూమిరెడ్డి వెంకటేశ్, పల్లీటి సుదర్శన్ రెడ్డి, ఆవుల కృష్ణ కిషోర్, దేవిరెడ్డి వెంకట సురేష్ బాబు, వల్లంకొండు వెంకట రమణ, మెంటా నాగేంద్ర, రవి, హర్ష వర్ధన్ బాబు, శీలం శంకర్, ఆవులేటి శేఖర్‌తో పాటు పలువురు పాత్రికేయులు జర్నలిస్టుల హక్కులను పరిరక్షించాలని ఆర్డీవో ఆకుల వెంకట రమణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం భూమిరెడ్డి వెంకటేశ్, పల్లీటి సుదర్శన్ రెడ్డి, ఆవుల కృష్ణ కిషోర్‌తో పాటు పలువురు మాట్లాడుతూ దేశంలో జర్నలిస్టులంటే ఎంతో గౌరవం ఉందన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, పత్రికా రంగం అస్థిత్వాన్ని పరిరక్షించాలని, పాత్రికేయుల వృత్తి వేతన, బాధ్యత హక్కులను రక్షించాలని, పాత్రికేయులపై దాడులను అరికట్టాలని, జర్నలిస్టులకు రక్షణకై కల్పించే చట్టాలను అమలు చేయాలన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సేవ్ జర్నలిస్ట్ డే కార్యక్రమాన్ని బద్వేలు పట్టణంలో నిర్వహించడం జరిగిందన్నారు. జర్నలిస్టుల న్యాయమైన సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వారు కోరారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు ప్రజా సమస్యలను సంబంధించిన అధికారుల దృష్టికి తీసుకెళ్ళి ప్రజలకు, అధికారులకు వారధిగా ఉంటూ నిరంతరం కృషి చేస్తున్న జర్నలిస్టుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఆర్డీవో ఆకుల వెంకటరమణ మాట్లాడుతూ ప్రజలకు, అధికారులకు వారధిగా జర్నలిస్టులు విధినిర్వహణలో నిరంతరం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పాత్రికేయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని, పాత్రికేయుల హక్కులను పరిరక్షించే విధంగా చూస్తామన్నారు.

## వడదెబ్బకు జాగ్రత్తగా ఉండాలి

పుల్లంపేట, మార్చి 23 ప్రభాతవార్త



మండలంలో ప్రజలు రాబోవు కాలంలో వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తగా వహించాలని మండల స్థాయి సమన్వయ కమిటీలో అధికారులు ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మనోజ్‌చంద్ర మాట్లాడుతూ వడదెబ్బ అనేది వేసవికాలంలో సామాన్యంగా వచ్చే సీజనల్ వ్యాధి అని అన్నారు. ఈ వ్యాధివల్ల 5సంవత్సరాలలోపు పిల్లలకు, 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, ధీర్ఘకాలిక వ్యాధులైన డయాబెటిస్, బిపి, స్థూలకాయం లాంటి వారికి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. దీనికి సంబంధించిన లక్షణాలను, నివారణ చర్యలను ఆయన వివరించారు. తహశిల్దారు కుమార్ మాట్లాడుతూ నివారణ చర్యల్లో భాగంగా ప్రతి బస్టాండ్, రైల్వేస్టేషన్, ఇతర ప్రాంతాల్లో నీటిసరఫరా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి అంగన్వాడి కేంద్రంలో, పాఠశాల, కాలేజి, వసతిగృహాలు, గ్రామ సచివాలయాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రకాష్, సబ్‌ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, డిప్యూటీ తహశిల్దారు ప్రసన్న, సిహెచ్‌ఓ రాజా, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలి

– డైట్ ప్రిన్సిపల్ శివభాస్కర్

గాలివీడు, మార్చి 23ప్రభాతవార్త:




ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలని రాయచోటి డైట్ కళాశాల ప్రిన్సిపల్ మునగ శివభాస్కర్ పేర్కొన్నారు. గురువారం గాలివీడులోని స్థానిక గౌతమ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 10వ తరగతి వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ప్రణాళికాబద్దంగా ప్రశాంత వాతావరణంలో సన్నద్ధం కావాలని సూచించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం షింటో, థామస్‌లు లు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రవిచంద్ర, పాఠశాల ప్రిన్సిపల్ బినమ్ ఫ్రాన్సిస్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సురేష్, అక్తర్, హేమలత, శ్రీనివాసులు, అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

## అనురాధ గెలుపుపై టిడిపి శ్రేణులు హర్షం

పోరుమామిళ్ళ రూరల్, మార్చి 23ప్రభాతవార్త:



రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పుంజుకుంటుందని 2024 ఎన్నికల్లో ఖచ్చితంగా తెలుగుదేశం ఘన విజయం సాధిస్తుందని బి.కోడూరు మండల తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ఓ. రామచంద్రరెడ్డి పేర్కొన్నారు. జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 23 మంది ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి అనురాధకు ఓటు వేసి గెలిపించారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో అసమతి పూర్తిగా ఉందని అన్నారు. గత పట్టభద్రుల ఎన్నికల్లో కూడా పట్టభద్రులు తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి ఘనవిజయాన్ని అందించారని ఈనాడు ఎమ్మెల్యేలు కూడా న్యాయానికి ఓటేసి తెలుగుదేశం పార్టీని గెలిపించారని పేర్కొన్నారు. 23వ తేదీ 23 మంది ఎమ్మెల్యేలు ఓటు వేసి తెలుగుదేశం పార్టీని గెలిపించారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మీద ప్రజలు మేథావులతో పాటు ఎమ్మెల్యేల్లో కూడా అసమ్మతి పూర్తిగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీకి 23వ తేదీ లక్కీ తేదీ అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసిన ఎమ్మెల్యేలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## దళితుల భూముల్లో పెన్సింగ్‌ను కూలగొట్టిన తెదేపా నాయకులు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 23 ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండలంలోని చియ్యవరం గ్రామ పంచాయతి పొలంలో సర్వేనంబరు 369/3లో 2.59 ఎకరాలు భూమి గుండాల పెంచలయ్యకు చెందిన భూమిని కాజేయాలనే ఉద్ధేశ్యంతో అదే గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ వారు ఏదోటి నారాయణ, ఏదోటి హరినాథ్, గడికోట చంద్రయ్యలు గత రాత్రి ఎవరూ లేని సమయంలో 2 లక్షలు విలువ చేసే పెన్సింగ్ రాళ్లను కూలదోసినట్లు బాధితుడు గుండాల పెంచలయ్య రైల్వేకోడూరు సిఐ విశ్వనాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. అయితే ఇందులో దళితులమైన తమకు ఇందిరాగాంధి పరిపాలన సమయంలో డికెటి భూములను మంజూరు చేసిందని, ఆ భూమిని అగ్రవర్ణాల తెలుగుదేశంపార్టీవారు స్వాధీనం చేసుకోవాలనే ఉద్ధేశ్యంతో తాము వేసుకున్న కంచెను కూలదోశారని, దీనిపై పైనకనబరిచిన ముగ్గురిపై విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితులు సిఐకి విన్నవించారు. ఈ సందర్భంగా సిఐ విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ క్షుణ్ణంగా డికెటికి సంబంధించిన భూములను ఎవరైనా ఆక్రమిస్తే తప్పక కఠినచర్యలు ఉంటాయని బాధితులకు న్యాయం చేసేవిధంగా కృషి చేస్తామని ఆయన అన్నారు.

## మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారం

డివైడర్ పైన మొక్కలను సంరక్షించాలి
– మార్నింగ్ వాక్‌లో మున్సిపల్ కమీషనర్ కృష్ణారెడ్డి

బద్వేలు అర్బన్, మార్చి 23 ప్రభాతవార్త :



మున్సిపాలిటీ పరిధిలోని డివైడర్లపైన నాటిన మొక్కలను పరిరక్షించే విధంగా కృషి చేయాలని మున్సిపల్ కమీషనర్ కల్లూరు వెంకట కృష్ణారెడ్డి మున్సిపల్ సిబ్బందికి సూచించారు. గురువారం మార్నింగ్ వాక్‌లో పట్టణంలోని పలు ప్రధాన రహదారులలో మొక్కలను పరిశీలించారు. డివైడర్‌పైన ఉన్న మొక్కలకు రాబోవు వేసవి కాలంలో నీటి నిల్వ ఉండే విధంగా పాదులు చేపట్టాలని మున్సిపల్ మేస్త్రీలు విష్ణు, ప్రసాద్‌తో పాటు పలువురికి సూచించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపైన పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పుర ప్రజలకు ఇచ్చిన చెత్త బుట్టలలో తడి చెత్త, పొడి చెత్త, హానికర వ్యర్థాలను వేరువేరుగా ఉంచి మున్సిపాలిటీ చెత్త సేకరణ వాహనాలు వచ్చినపుడు వాటిలో వేయాలని ప్రజలకు సూచించారు. రాబోవు వేసవి కాలంలో పట్టణంలోని పలు ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేయాలన్నారు. గురువారం పలు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు వారు పరిశీలించారు.

## పద్మశ్రీ కె.విశ్వనాథ్ సంకల్ప పురస్కారం అందుకున్న ప్రిన్స్ వంజ

కడప వైద్యవిభాగం, మార్చి 23, ప్రభాతవార్త:



సినీ రచయితలు, నటులు, గాయకులు, నాట్య, నాటక కళాకారులు మరియు వివిధ రంగాల్లో తమ సేవలు అందించిన వ్యక్తులకు ఉగాది సందర్భంగా పద్మశ్రీ దాదా సాహెబ్ పాల్కే అవార్డు గ్రహీత డా.కె.విశ్వనాథ్ పేరున ఉగాంది మరియు సంకల్ప పురస్కారాల ప్రదానోత్సవం అట్టహాసంగా ఈ పురసాకరాలు ఉగాది పర్వదినాన అందజేశారు. కడప వాసి అయిన ప్రిన్స్ వంజ తన సంస్థ ఏవీఎం చారిటీస్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను, గానం, సంగీతం మరియు సాంకేతిక విభాగాలలో తన కృషిని ప్రతిభను గుర్తించి పద్మశ్రీ డా.కె.విశ్వనాథ్ సంకల్ప పురస్కారాలతో సత్కరించారు. ఈ పురస్కారాలకు తనను ఎంపిక చేసిన సంస్థ అధ్యక్షులు బండారు నరసింహారావు, సంస్థ సభ్యులకు,తోటి కళాకారులకు తన కృతజ్ఞతలు తెలిపారు.

## జగనన్న కాలనీలో అందరికి మెరుగైన వసతులు

నందలూరు, మార్చి 23 ప్రభాతవార్త

నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి పరిధిలోని నారాయణరాజుపేటలో జగనన్న కాలనీ నిర్మాణ పనులను పర్యవేక్షించిన మండల పరిషత్ అధ్యక్షులు మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎంపిడిఓ సౌభాగ్యమ్మ, విఆర్‌ఓ రాజు, ఇంజనీరింగ్ సిబ్బంది పావని, ప్రసన్నకుమార్, రామాంజేయులు, సర్వేయర్ చంద్రబాబు, శివ లేఅవుట్‌కు సంబంధించి కొలతల ప్రకారంగా లబ్ధిదారులు నిర్మాణ పనులను చేపట్టి ఉన్నారా లేక ఏమైనా లోపాలు ఉన్నాయా అని మండల పరిషత్ అధ్యక్షులు ఇంజనీరింగ్ సిబ్బందిని రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు కొనసాగిస్తున్న లబ్ధిదారులను నీటి వసతి గురించి విద్యుత్తు దీపాలు గురించి విద్యుత్తు కనెక్షన్ల గురించి, రోడ్డు నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏవిధమైన లోటుపాట్లు లేకుండా పనులు సక్రమంగా సజావుగా సాగుతున్నాయని లబ్ధిదారులు చెప్పారు. ఒకటో రెండో ఇళ్ల నిర్మాణాలు పొలతలకు మించి ఉండగా వాటిని స క్రమంగా నిర్వహించాలని అందరికి సమానమైన కొలతలే ఉన్నాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి జిల్లా ఉప మండలాధ్యక్షుడు అనుదీప్, తుమ్మల భావన శ్రీధర్‌గౌడ్, మండల కోఆప్షన్ మెంబర్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బిసి నాయకులు విజయుడు, వైశ్య సంఘం ఉపాధ్యక్షులు నరసింహాశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## జలజీవన్ మిషన్ వరల్డ్ వాటర్‌డే

నందలూరు, మార్చి 23 ప్రభాతవార్త



నందలూరు మండలం నందలూరు పంచాయతిలో గల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం వరల్డ్ వాటర్ డే కార్యక్రమాన్ని జల్ జీవన్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు అవగాహన, నీటి అవసరాలు గురించి తెలియజేస్తూ ర్యాలీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కాలుష్య ప్రభావం వల్ల నీటి వనరులు చాలా అడుగంటిపోతున్నాయని అన్నారు. ప్రజలు కాలుష్య నియంత్రణకు సహకరించాలని, ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలను వాడకం తగ్గించాలని అప్పుడు భూగర్భజలాలు పదిలంగా ఉంటాయి అన్నారు. ప్రజల జీవన మనుగడకు నీరు ఎంతో అవసరం అని, ప్రతిఒక్కరూ మంచి నీటిని కలుషితం, వృథా చేయకూడదని, జల జీవన్ మిషన్ ప్రతినిధులు రహమతతున్నీషా, సర్పంచ్ సుభాషిణి, పంచాయతి సెక్రటరి శ్రీనివాసులు, టిడిపి నాయకులు మోడపోతుల రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం కిరణ్ ఇంటికి క్యూ కట్టిన పీలేరు నేతలు

పీలేరు, మార్చి 23 ప్రభాతవార్తః



పీలేరు నియోజవకవర్గ ఇన్‌చార్జి తెదేపా నాయకులు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కుమార్తె వివాహం హైదరాబాదులో జరుగుతున్నందున వివాహానికి హాజరైన పీలేరు నియోజకవర్గ అన్ని పార్టీల నేతలు మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఇంటిలో ఆయనను కలుసుకునేందుకు క్యూ కట్టారు. గత నెల రోజుల నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డి బాజాపాలో చేరనున్న ప్రచారం ఊపందుకోవడం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం పలు రకాల ఆసక్తికరమైన విషయాలు ప్రచారాలు జరుగుతుండటంతో యోగ క్షేమాలతో పాటు ఏ పార్టీలో చేరతారు అనే అంచనాలు తెలుసుకునేందుకు పీలేరు నియోజకవర్గ ప్రజలు ఆయనను కలుసుకున్నట్లు జేపీసీ రాష్ట్ర ప్రధాన కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఏదిఏమైనప్పటికి హైదరాబాదులో మాజీ సీఎంను కలవడం నియోజకవర్గంలో ప్రజలకు శుభసూచకం అని వ్యాఖ్యానిస్తున్నారు.

## వరుస విజయాలతో టిడిపి...కనుమరుగు కానున్న వైసిపి

జోష్యం చెప్పిన పంతగాని

రైల్వేకోడూరు రూరల్, మార్చి 23 ప్రభాతవార్త



రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరుస విజయాలతో విజయదుందుమి మోగిస్తున్నదని, అదేకోవలో వైసిపి కనుమరుగవుతుందని రాష్ట్ర సాంస్కృతికవిభాగం అధ్యక్షులు, రైల్వేకోడూరు తెలుగుదేశంపార్టీ యువ నాయకులు పంతగాని నరసింహ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల తో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, 40 సంవత్సరాలు అనుభవం గల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పిన ప్రకారంగా రాష్ట్ర ప్రజలు తెలుగుదేశానికి జై.. వైసిపికి నై... అనే నినాదంతో పరిపాలన సాగుతుందని, రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒప్పుకోవడంలేదని, అందుకు నిదర్శనమే ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఫలితాలు అని పంతగాని ఘాటుగా విమర్శించారు. ముఖ్యంగా ప్రజాపరిపాలన, ఒక్క నారా చంద్రబాబు నాయుడికే ఎరుక అని, పరిపాలనలో మెళుకువలు తెలియని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. నారా లోకేష్ చేపట్టిన యువగళంతో రాష్ట్రంలో యువరక్తం తెలుగుదేశంవైపు పరుగులు తీస్తున్నదని, ఏనాటికైనా తెలుగుదేశం రథసారథులు నారా చంద్రబాబు, నారా లోకేష్‌లు రాబోయే పరి పాలన అధ్యక్షులు అని అందుకు నిదర్శనం ఇప్పటి ఫలితాలేనని ఆయన అన్నా రు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మసిపూసి ఇంటికి పంపించే కార్యక్రమాలు రాష్ట్ర ప్రజలే చేయబోతున్నారని పంతగాని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత నాయకులు బొక్కసం సునీల్, దళిత నాయకుడు కూని చంద్రయ్య, మైనార్టీ నాయకులు జుబేర్, బిసి నాయకు లు మండ్ల అమర్, చిగురుపాటి నరసింహా, కస్తూరి దినేష్, హరితో పాటు టిడిపికి చెందిన

## రంజాన్ పవిత్ర మాసం నెలవంక కనిపించింది

రాయచోటి, మార్చి 23ప్రభాతవార్త:

రంజాన్ పవిత్ర మాసం నెలవంక గురువారం సాయంత్రం కనిపించింది. దీంతో ముస్లిం సోదరులు శుక్రవారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా మసీదుల వద్ద సహరీ ఇఫ్తార్ ప్రత్యేక తరావీ ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ముస్లిం సోదరులు మసీదుల వద్దకు చేరుకున్నారు. నెలవంక దర్శనం కోసం ఎదురు చూశారు. నెలవంక దర్శనంతో ఒకరినొకరు అలింగనం చేసుకుని మహేసయ్యాం ముబారకో హో...మహే ముఖద్దస్ రంజాన్ ముబారక్‌హో అంటూ రంజాన్ నెల ఆరంభ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.